JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజ్‌గిరి । శనివారం 05-09-2026
Medchal - Malkajgiri । Saturday 05-09-2026
Follow: jayabherinews
సంపుటి : 03 । సంచిక : 96
పేజీలు : 8 । వెల : 5
Vol. 03 । Issue 96 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com





- సీఎం అయితేనే సభలోకి కేసీఆర్..!
- ప్రజా తీర్పు కంటే పదవే ముఖ్యమా?
- ప్రజలు ప్రతిపక్షంలో కూర్చోబెట్టారు.. సభకే రానంటారా?
- కేసీఆర్ శపథమా.. ప్రజాతీర్పుపై నిర్లక్ష్యమా?
- సభకు రారు.. సీఎం పదవి వస్తేనే వస్తారా?
- జయలలిత, ఎన్టీఆర్ శపథాలకు.. కేసీఆర్ నిర్ణయానికి పోలికుందా?
- ప్రతిపక్ష బాధ్యత వద్దా..? సీఎం అయితేనే సభలోకి!

**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 4 :**

సీఎంగానే కేసీఆర్ అసెంబ్లీకి వస్తారని కేటీఆర్ ప్రకటించారు. అంటే ఆయన ఇక అసెంబ్లీకి రారని తేల్చేశారు. అయితే కేటీఆర్ చేసిన ఈ ప్రకటన రాజకీయవర్గాలను ఆశ్చర్యపరిచింది. ఎందుకు ఇంత అహంకారం అన్న ప్రశ్న వస్తోంది. రాజకీయాల్లో ఇలాంటి నిర్ణయాలు కొత్త కాదు కానీ.. పూర్తిగా ప్రజల్ని తక్కువ చేసే ఇలాంటి నిర్ణయం మాత్రం కొత్త. గతంలో ఇలాంటి సవాళ్లు చేసిన వాళ్లు చాలా పక్కాగా చేశారు.రాజకీయాల్లో శపథాలు, ప్రతీకారాలు, సవాళ్లు కేవలం వ్యక్తిగత పంతాలు మాత్రమే కావు. అవి ప్రజలలో ఒక బలమైన భావోద్వేగాన్ని , సానుభూతిని రగిల్చే శక్తివంతమైన ఆయుధాలు. భారత రాజకీయ చరిత్రను ఒక్కసారి తిరగేస్తే.. తమిళనాడు అసెంబ్లీలో తీవ్ర అవమానాన్ని ఎదుర్కొని ముఖ్యమంత్రిన య్యాకే సభలో అడుగుపెడతాను అని ప్రతీజ్ఞ చేసి గెలిచిన జయలలిత, ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీలో జరిగిన పరాభవాన్ని తట్టుకుని ప్రజాక్షేత్రంలోకి వెళ్లి తిరిగి అధికారంలోకి వచ్చిన ఎన్టీఆర్, ఇటీవలే వ్యక్తిగత విమర్శలతో నొచ్చుకుని సభ వీడి, అఖండ మెజారిటీతో మళ్లీ సీఎం పీఠంపై కూర్చున్న చంద్రబాబు నాయుడు మనకు కనిపిస్తారు. వీరందరి శపథాల వెనుక ఒక తీవ్రమైన అవమానం, పోరాటం, ప్రజాదరణ సాధించాలనే బలమైన ఆరాటం ఉన్నాయి. కానీ, కేసీఆర్ అసెంబ్లీకి వెళ్లకపోవడానికి కారణం అలాంటిది కాదు. ఆ నాయకుల వ్యూహాలకు,

...మిగతాది 2 లో






## ఎల్ నినోను ఎదుర్కొందాం

- రాష్ట్రంలో పరిస్థితులపై కేంద్రానికి లేఖ
- కోర్టు కేసులున్న పట్టణ స్థానిక సంస్థల్లో విలీన ప్రతిపాదన పక్కన పెట్టి ఎన్నికలు
- మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు

**జయభేరి, అమరావతి:**

రాష్ట్రంపై ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉంది. గత 30 ఏళ్లలో ఎన్నడూ లేనంత అతి తక్కువ వర్షపాతం నమోదైందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు కార్యోన్ముఖులు కావాలని మంత్రులకు సూచించారు. రాష్ట్రంలో ఎక్కడా తాగడానికి నీరు లేదన్న పరిస్థితి రాకూడదని, ఇప్పటికే వేసిన పంటల్లో ఒక్క ఎకరం కూడా ఎండకూడదని, దానికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంపై ఎల్ నినో ప్రభావ తీవ్రతను వివరిస్తూ, తగిన సాయం చేయాలని కేంద్రానికి లేఖ రాస్తున్నానని, ఇకపై ప్రతి నెలా లేఖ పంపిస్తామని ఆయన గురువారం మంత్రివర్గ సమావేశంలో పేర్కొన్నారు. దేశంలోనే అతి తక్కువ వర్షపాతం రాష్ట్రంలోనే నమోదైందని, ఇప్పటి వరకు 56% లోటు ఉందని తెలిపారు.

...మిగతాది 2 లో



## ముఖ్యమంత్రీ.. చెత్త పనులు మానుకో

- ప్రాపర్టీ ట్యాక్స్ తో పాటు చెత్త పైసలు వసూలు చేస్తారా?
- స్వచ్ఛ ఆటో కార్మికుల పొట్టకొడితే చూస్తూ ఊరుకోం
- స్వయం ఉపాధి పొందుతున్న వాళ్ల ను రాంకీకి జీతగాళ్లుగా మారుస్తారా?
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

**జయభేరి, హైదరాబాద్ :**

మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న ముఖ్యమంత్రి చెత్త పనులు మానుకోవాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షులు కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. శుక్రవారం బంజారాహిల్స్ లోని పార్టీ కార్యాలయంలో స్వచ్ఛ ఆటో కార్మికులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం రాంకీ సంస్థకు చెత్త సేకరణ బాధ్యతలు అప్పగిస్తోందని, ప్రాపర్టీ ట్యాక్స్ లో కలిపి చెత్త పైసలు వసూలు చేస్తే తమ ఉపాధి దెబ్బతింటుందని కార్మికులు వివరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, రాంకీ సంస్థకు లాభం చేయడానికి స్వచ్ఛ ఆటో కార్మికుల పొట్టకొట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నాడని మండిపడ్డారు. ప్రభుత్వంతో సంబంధం లేకుండా స్వయం ఉపాధి పొందుతున్న వారిని రాంకీ సంస్థకు

...మిగతాది 2 లో

# వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో
# వెయ్యి పడగల అవినీతి




- కమిషన్ల కోసం కేసీఆర్ సంక్షేమ పథకాలకు మంగళం!
- కాంగ్రెస్ పాలనంతా కబ్జాలు, కుంభ కోణాలే
- 'మళ్లీ వచ్చేది కేసీఆర్ సర్కారే'... బెల్లంపల్లిలో హరీశ్‌రావు పిలుపు
- వెయ్యి రోజుల పాలన... ప్రజలకు కన్నీళ్లు, కాంగ్రెస్ నేతలకు కమిషన్లు!
- తెలంగాణలో అవినీతికి వెయ్యి పడగలు... కాంగ్రెస్‌పై హరీశ్ ఫైర్
- సంక్షేమాన్ని సమాధి చేసి... సెటిల్మెంట్లలో మునిగిన కాంగ్రెస్!
- కబ్జాల రాజ్యం పోవాలి... కేసీఆర్ పాలన రావాలి: హరీశ్‌రావు

**జయభేరి, మంచిర్యాల :**

కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల వైఫల్యాలను నిరసిస్తూ మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన వంటావార్పు నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వంటావార్పు కార్యక్రమంలో పాల్గొన్న హరీశ్ రావు.. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి, మోసపూరిత విధానాలపై తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. పేదల సంక్షేమాన్ని గాలికొదిలేసి, కమిషన్ల కోసమే కాంగ్రెస్ పాలన సాగిస్తోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి వెయ్యి రోజుల పాలనలో ఏం జరిగిందని చూస్తే.. అంతా కబ్జాలు, కుంభకోణాలు, లూటీలు, సెటిల్మెంట్లే తప్ప పాలన ఎక్కడా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. వెయ్యి రోజుల రేవంత్ పాలనలో అభివృద్ధి మటుమాయమైపోయింది. వెయ్యి పడగలతో అవినీతి రాజ్యమేలుతోంది.ఈ రాష్ట్రంలో పేదల సంక్షేమం పూర్తిగా బందైపోయింది. కేసీఆర్ గారు ప్రవేశపెట్టిన పథకాల వల్ల కమిషన్లు రావన్న ఒకే ఒక్క కారణంతో వాటన్నింటినీ రేవంత్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా ఎత్తేసిందని అన్నారు. రైతుబంధు నిర్వీర్యమైంది, రైతుబీమా ఎగ్గొట్టారు, కేసీఆర్ కిట్ బంద్ చేశారు, గొర్రెల పంపిణీ పథకం ఆపేశారు, చేప పిల్లల పథకాన్ని గాలికొదిలేశారు, బీసీ బంధు జాడ లేదు, దళితబంధు పత్తా లేకుండా పోయింది. రేవంత్ పాలన అంతా కేవలం కమిషన్ల చుట్టూనే తిరుగుతోంది.

## మద్దూరు డిగ్రీ కాలేజీ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- సీఎం రేవంత్ రెడ్డి

**జయభేరి, నారాయణపేట :**



మద్దూరులో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా భవన నిర్మాణం పూర్తి చేయాలని చెప్పారు. వికారాబాద్, నారాయణపేట జిల్లాల్లో పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి ముందుగా మద్దూరులో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల పనులను ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాలేజీ డిజైన్లు, లేఅవుట్లు పరిశీలించి పలు మార్పులను సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిర్మాణాలు జరగాలని, కళాశాల చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడొద్దని చెప్పారు. స్థానికులను పలకరిస్తూ, వారితో కరచాలనం చేశారు. సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల పనులను ముఖ్యమంత్రి పరిశీలించారు. పదేళ్ల కిందట ప్రజల అవసరాల కోసం సొంత డబ్బుతో కొనుగోలు చేసిన భూమిని ఆ తర్వాత ప్రభుత్వానికి అప్పగించగా, ఆ స్థలంలో సాంఘిక

...మిగతాది 2 లో

▸▸ మొదటిపేజీ తరువాయి

## సీఎంగానే అసెంబ్లీలోకి..?

ఇప్పటి కేసీఆర్ వైఖరికి చాలా తేడా కనిపిస్తోంది. అసెంబ్లీ సభలో కేసీఆర్‌ను ఎవరూ ప్రత్యక్షంగా అవమానించలేదు, సభ నుండి పంపించివేయలేదు. అలాంటి అవకాశం కూడా ఆయన ఇవ్వలేదు. సభకు రాలేదు. కేసీఆర్ సభకు వస్తే ఆయన గౌరవం తగ్గకుండా చూస్తానని రేవంత్ హామీ కూడా ఇచ్చారు. అయినా మనసు మార్చుకోలేదు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల్లో ఓటమి చెందిన తర్వాత, ప్రతిపక్ష నాయకుడిగా అసెంబ్లీలో ఉండి ప్రజల ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన బాధ్యత ఆయనపై ఉంది. అయితే, సభకు రాకుండా మళ్లీ సీఎం అయ్యాకే వస్తాను అని వించడం ఏ రకమైన రాజకీయ వ్యూహమో ప్రజలకు అర్థం కావడం లేదు. చరిత్ర సృష్టించిన నాయకులు తమకు జరిగిన అవమానాలను లేదా ఓటములను ప్రజల్లోకి తీసుకెళ్లి, రోజువారీ పోరాటాలతో ప్రజాదరణను తిరిగి పునాదిగా మలచుకున్నారు. చంద్రబాబు కానీ, ఎన్టీఆర్ కానీ శాసనసభకు దూరంగా ఉన్న సమయంలో నిరంతరం ప్రజల్లోనే ఉన్నారు. కానీ, కేసీఆర్ ఓటమి అనంతరం అత్యధిక సమయం ఫామ్ హౌస్‌కే పరిమితమవ్వడం, ప్రజాక్షేత్రంలో చురుగ్గా కనిపించకపోవడం వల్ల ప్రజలు కూడా భావోద్వేగానికి గురయ్యే చాన్స్ లేదు. సీఎం పదవి లభిస్తేనే సభకు వస్తాననడం ప్రజల్లో సానుభూతిని కలిగించకపోగా, బాధ్యతారాహిత్యమనే భావనను పంపే ప్రమాదం ఉంది. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష హోదా అనేది తక్కువదేమీ కాదు. ప్రజాసమస్యలపై అసెంబ్లీ వేదికగా గళమెత్తడమే ప్రతిపక్ష నాయకుడికి అసలైన గౌరవం , బలం. సభకు రాకుండా ఫామ్ హౌస్‌లో విశ్రాంతి తీసుకుంటూ, రాబోయే ఎన్నికల్లో మళ్లీ అధికారం వస్తుందని ఆశించడం చోద్యంగా ఉందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాదరణ అనేది ఇంట్లో కూర్చుంటే వచ్చేది కాదు, సభ లోపల , బయట ప్రజల తరఫున నిలబడి పోరాడితేనే లభించేది. ఈ విషయాన్ని గ్రహించకుండా కేవలం అధికారం వచ్చాకే అసెంబ్లీకి వస్తా అని పట్టుబట్టడం రాజకీయంగా కేసీఆర్‌కు లాభం కంటే నష్టమే ఎక్కువ చేస్తుంది.

## ఎల్ నినోను ఎదుర్కొందాం

అత్యధికంగా అన్నమయ్య జిల్లాలో 77, ప్రకాశం జిల్లాలో 70 శాతం లోటు వర్షపాతం నమోదైందని ఆయన పేర్కొన్నారు. ఎల్ నినో ప్రభావంపై మంత్రి వర్గ సమావేశంలో గంటన్నరకు పైగా చర్చించారు. జలాశయాల్లో నీళ్లున్నా పంటలకు ఇవ్వలేదని వైకాపా తప్పుడు ప్రచారం చేస్తోందని సీఎం మండిపడ్డారు. దీన్ని సమర్థంగా తిప్పికొట్టడంతో పాటు ప్రజలకు వాస్తవ పరిస్థితులు వివరించాలని మంత్రులకు సూచించారు. ఉన్న నీటిని పొదుపుగా వాడుకో వాలని.. ప్రజలకు, పశువులకు తాగునీటికి, ఆ తర్వాత పండ్ల తోటలకు ప్రాధా న్యమివ్వాలని స్పష్టం చేశారు. తాగునీటి సరఫరాకు ఎంత ఖర్చు పెట్టేందుకైనా సిద్ధమన్నారు.

**ఎప్పటికప్పుడు సమీక్షించండి:**

'ఇలాంటి సంక్షోభ సమయంలోనే నాయకుల్లోని సమర్థత బయటపడుతుంది. మంత్రులు జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలి. అందుబాటులో ఉన్న నీటి వనరులతో ఈ విపత్తు నుంచి ఎలా గట్టెక్కగలమో ఆలోచించాలి. ఎల్ నినో ప్రభావం ఉన్నా జీఎస్డీపీలో వ్యవసాయ రంగం వాటా తగ్గకూడదు. ఇకపై ప్రతి కేబినెట్ సమావేశంలో 20 నిమిషాలు ఈ అంశంపై చర్చిద్దాం. మీరు (మంత్రులు) కూడా రైతులు, రైతు సంఘాలు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, సొసైటీలతో సమావేశాలు నిర్వహించి పరిస్థితి వివరించండి. భూగర్భ జల మట్టాల్ని చూసుకుని, అవసరమైతే బోర్లు వేసి, రైతులకు నీళ్లిచ్చేందుకు ఉన్న అవకాశాల్ని పరిశీలించండి. రాష్ట్రంలోని 210 రైతు సేవా కేంద్రాల ద్వారా సీడ్‌బాల్స్‌ని వెదజల్లే కార్యక్రమం విస్తృతంగా చేపట్టాలి. పశుగ్రాసం పెంచితే పశువులకు దాణాకైనా ఉపయోగపడు తుంది' అని సీఎం పేర్కొన్నారు. ఎల్ నినో ప్రభావంతో నిత్యావసరాల ధరలు పెరగకుండా స్థిరీకరించేందుకు చర్యలు తీసుకోవాలని పౌర సరఫరాలు, ఆర్థిక, వ్యవసాయ శాఖల మంత్రులు మనోహర్, పయ్యావుల కేశవ్, అచ్చె న్నాయుడులకు చంద్రబాబు సూచించారు. రైతులజాగ్రత్తతో తక్కువ ధరకు బియ్యం సరఫరా చేస్తున్నామని మనోహర్ చెప్పగా.. మిగతా వస్తువుల ధరల నియంత్రణకూ ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు.

## వెయ్యి పడగల అవినీతి

ఎన్నికల ముందు వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని, అవ్వా తాతలకు నాలుగు వేల పెన్షన్ ఇస్తామని ఊదరగొట్టారు. కేసీఆర్ గారు అధికారంలో ఉన్నప్పుడు మాట తప్పకుండా రూ.200 ఉన్న పెన్షన్ను మొదటి నెలలోనే రూ.2,000 చేసిన గొప్ప నాయకుడు. కానీ, రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చి 33 నెలలు పూర్తయినా.. ఒక్క వికలాంగుడికి, ఒక్క వితంతువుకి, ఒక్క వృద్ధుడికి కూడా కొత్త పెన్షన్ ఇవ్వలేదని అన్నారు. కేసీఆర్ ఏకంగా 42 లక్షల మంది పేదలకు నెలనెలా రూ.2,000 గౌరవప్రదంగా పెన్షన్ అందిస్తే.. రేవంత్ రెడ్డి కొత్త పెన్షన్లు ఇవ్వకపోగా, ఉన్నవాటిలో ఏకంగా మూడున్నర లక్షల పెన్షన్లను నిర్దాక్షిణ్యంగా రద్దు చేసి పేదల కడుపు కొట్టాడు. రేవంత్ రెడ్డి నిత్యం ఆంధ్రప్రదేశ్ ఆదర్శం అంటాడు, ఆయన గురువు గారిని ఆదర్శంగా తీసుకుంటానని చెబుతాడు. మరి నీ గురువు గారు ఆంధ్రప్రదేశ్లో గెలిచిన మొదటి నెలలోనే 4,000 పెన్షన్ ఇస్తున్నప్పుడు.. 33 నెలలైనా నువ్వు తెలంగాణలో ఎందుకు ఇవ్వడం లేదు? వృద్ధుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ రేవంత్ సర్కార్ను నిలదీస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చూస్తే.. గత 33 నెలలుగా నెలకు రూ.2,000 చొప్పున ఇప్పటివరకు ప్రతి అవ్వకు, తాతకు కాంగ్రెస్ సర్కార్ ఏకంగా రూ.66,000 బాకీ పడింది. ఇప్పుడే పెన్షన్లు పెంచితే ఎన్నికల నాటికి మర్చిపోతారట.. అందుకే ఎన్నికలకు ఆరు నెలల ముందో, మూడు నెలల ముందో రూ.4,000 చేస్తామని రేవంత్ రెడ్డి జాదా ఉషారు, అతితెలివితేటలు ప్రదర్శిస్తున్నాడని అన్నారు. కానీ తెలంగాణ ప్రజలు నీకంటే తెలివైనవాళ్లు. ఎన్నికల ముందు నువ్వు ఇచ్చినా తీసుకుంటారు, కానీ బాకీ పడ్డ మొత్తం రూ.66 వేలు లెక్క తేల్చిన తర్వాతే రేవంత్ రెడ్డిని నిలదీస్తారు. రేవంత్ రెడ్డి పాలన అంతా గాలి మాటలకే పరిమితమైంది. అయితే బూతు పురాణం మాట్లాడటం, లేదంటే ప్రభుత్వ భూములను అడ్డగోలుగా అమ్ముకోవడం.. ఇంతకుమించి ఈ ప్రభుత్వంలో ఇంకేమైనా పాలన ఉందా? కనబడ్డ దేవుళ్ల మీదల్లా ఒట్లు పెట్టి.. చివరికి రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయకుండా రైతులను నట్టేట ముంచారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో మోసాలు, కుంభకోణాలు, ప్రమాణాలు తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని అన్నారు.

## మద్దూరు డిగ్రీ కాలేజీ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణాన్ని చేపట్టారు. జిల్లా పర్యటనలో భాగంగా ఇక్కడకు చేరుకున్న ముఖ్యమంత్రి పాఠశాల నిర్మాణ ప్రణాళికలను పరిశీలించి ప్రాంగణమంతా కలియతిరిగారు. స్థానికులందరితో మాట్లాడి వారి నుంచి విజ్ఞాపనలను తీసుకున్నారు. గతంలో భూమి కొనుగోలు చేసిన సందర్భంగా భూములిచ్చిన రైతులను గుర్తించి ముఖ్యమంత్రి వారితో మాట్లాడారు. ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు.

## అక్రమ ఇసుక రవాణా..

- మూడు ట్రాక్టర్లు పట్టివేత

జయభేరి, కరీంనగర్ :

ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను కరీంనగర్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. పెట్రోలింగ్‌లో భాగంగా దుర్శేడు వైపు నుంచి కరీంనగర్‌కు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను తనిఖీ చేయగా, చేగుర్తి ప్రాంతంలోని ఇసుక బాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. దీంతో మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి తెలిపారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# సుభాష్ చంద్ర కేసులో ఏం జరుగుతోంది



మీడియా దిగ్గజం, ఎస్సెల్ గ్రూప్ వ్యవస్థాపకులు సుభాష్ చంద్ర వ్యక్తిగత దివాలా పరిష్కార ప్రక్రియలో కీలక పరిణామం చోటు చేసుకుంది. రూ.22006.57 కోట్ల క్లెయిమ్‌లకు గాను కేవలం రూ.6.5 కోట్ల చెల్లింపు ప్రణాళికకు తాత్కాలిక బ్రేక్ పడింది. ఈ దివాలా ప్రణాళికకు డివిజన్ బెంచ్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడంతో ఎన్ సీ ఎల్ టీ ప్రెసిడెంట్ జస్టిస్ అనుపిందర్ సింగ్ గ్రేవాల్ నేతృత్వంలో 5 మంది సభ్యుల ప్రత్యేక రాజ్యాంగ బెంచ్ ఏర్పాటు చేశారు. ఎన్‌సీఎల్‌టీ చరిత్రలోనే ప్రత్యేక బెంచ్ ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి ఐదుగురు సభ్యుల ప్రత్యేక బెంచ్ సెప్టెంబర్ 1, 2026న ఈ కేసులో నోటీసులు జారీ చేసింది. అశోక్ కుమార్ భరద్వాజ్, రీనా సిన్హాలతో కూడిన రెండవ నంబర్ ఎన్‌సీఎల్‌టీ డివిజన్ బెంచ్ ఈ దివాలా ప్రణాళికపై ఏకాభిప్రాయానికి రాలేకపోయింది. మూడో సభ్యుడైన నిలేశ్ శర్మ ఇచ్చిన స్వతంత్ర ఉత్తర్వు సైతం డివిజన్ బెంచ్‌లోని ఇద్దరితో విభేదించడంతో మెజారిటీ తీర్పు లేనందున ఎటువంటి తుది ఉత్తర్వులు ఇవ్వలేమని ట్రిబ్యునల్ స్పష్టం చేసింది. మెజారిటీ అభిప్రాయం రాకపోవడంతో కేసును ఎన్ సీ ఎల్ టీ ప్రెసిడెంట్‌కు పంపారు. కంపెనీల చట్టం 2013లోని సెక్షన్ 419 (5) ప్రకారం చరిత్రలోనే మొదటిసారిగా 5 మంది సభ్యుల ప్రత్యేక బెంచ్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో జస్టిస్ అనుపిందర్ సింగ్ గ్రేవాల్, జ్యుడీషిల్ సభ్యులు బచు వెంకట్ బలరామ్ దాస్, మహేంద్ర ఖండేల్వాల్, టెక్నికల్ మెంబర్స్ అతుల్ చతుర్వేది, రవీంద్ర చతుర్వేదిలు ఉన్నారు. సుభాష్ చంద్ర వ్యక్తిగత హామీలపై రూ.22,006.57 కోట్ల రుణాలకు సంబంధించి రుణ దాతల క్లెయిమ్‌లపై ఆయన దివాలా పరిష్కార ప్రణాళికకు వెళ్లారు. ఈ క్రమంలో కేవలం రూ.6.5 కోట్లు చెల్లించేందుకు ఎన్‌సీఎల్‌టీ ఆమోదం తెలిపినట్లు వార్తలు వచ్చాయి. రూ.22 వేల కోట్లకు పైగా అప్పును రూ.6.5 కోట్లతో సెటిల్ చేసేందుకు 80.81 శాతం ఓటింగ్ ఉన్న రుణదాతలు ఆమోదం తెలిపారు. అయితే ఇది దాదాపు 99.97 శాతం రుణాల రద్దుకు దారితీస్తోంది. ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వంటి 19.19 శాతం ఓటింగ్ కలిగిన సంస్థలు ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ క్రమంలో ఇన్సాల్వెన్సీ అప్పీలేట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాయి. సుభాష్ చంద్ర, అతని గ్రూప్ చాలా ఏళ్లుగా ఆర్థిక సంక్షోభంతో ఇబ్బంది పడుతోంది. వారి రుణ భారం క్రమంగా పెరుగుతూ వస్తోంది. కంపెనీలు తమ రుణాలను తిరిగి చెల్లించలేకపోయినప్పుడు విషయం కోర్టుకు చేరింది. నివేదికల ప్రకారం, ఎస్సెల్ గ్రూప్‌కు సుమారు ₹22,006 కోట్ల భారీ అప్పు ఉంది.

దీన్ని పరిష్కరించడానికి, సుభాష్ చంద్ర కేవలం ₹6.5 కోట్ల తిరిగి చెల్లింపు ప్లాన్ ఇచ్చారు. దీనిని ట్రిబ్యునల్ ఆమోదించింది. అంటే రుణాలు ఇచ్చిన బ్యాంకులు తమ రుణాలపై భారీగా నష్టపోవాల్సి ఉంటుంది. ఈ కీలక నిర్ణయం ఆమోదానికి దారి తీసిన న్యాయ ప్రక్రియ కూడా చాలా ఆసక్తికరంగా ఉంది. సెప్టెంబర్ 2025లో, ఎన్ సీ ఎల్ టీ కి చెందిన ఇద్దరు సభ్యుల ధర్మాసనం మధ్య రెండు విభిన్న అభిప్రాయాలు వెలువడ్డాయి. తదనంతరం, ఫిబ్రవరి 2026లో, ఈ విషయాన్ని ట్రిబ్యునల్ మూడో న్యాయ సభ్యుడైన నిలేష్ శర్మకు నివేదించారు. ఆయన ఈ ప్రణాళికను ఆమోదిస్తూ తన నిర్ణయాత్మక తీర్పును వెలువరించారు. అంతకుముందు, నవంబర్ 2024లో, రుణదాతల కమిటీ 80.814 శాతం ఓట్లతో ఈ ప్రణాళికను ఆమోదించింది. దివాలా, బ్యాంక్రప్టసీ కోడ్ ప్రకారం, ఏ ప్రణాళిక ఆమోదానికైనా 75 శాతం మెజారిటీ అవసరం, ప్రజలు తరచుగా ఎన్‌సిఎల్‌టిని ఒక కంపెనీగా భావిస్తుంటారు. కానీ వాస్తవానికి ఇది ఒక ప్రత్యేకమైన పాక్షికన్యాయ సంస్థ. దీని పూర్తి పేరు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్. దీనిని కేంద్ర ప్రభుత్వం, కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 408 కింద, 2016 జూన్ 1న అధికారికంగా ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలోని జస్టిస్ వి. బాలకృష్ణ ఎరాడి కమిటీ సిఫార్సుల ఆధారంగా ఈ సంస్థను ఏర్పాటు చేశారు. సాధారణ కోర్టుల ద్వారా కాకుండా, ఒక ప్రత్యేక వేదిక ద్వారా భారత్‌లో వ్యాపార, కార్పొరేట్ వివాదాల పరిష్కారాన్ని వేగవంతం చేయడమే దీని ప్రాథమిక ఉద్దేశ్యం. కార్పొరేట్ ప్రపంచానికి సంబంధించి ఎన్‌సిఎల్‌టికి విస్తృత శ్రేణి అధికారాలు, బాధ్యతలు ఉన్నాయి. ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్ (IBC, 2016) ప్రకారం, కంపెనీలను దివాలా తీసినట్లు ప్రకటించడం లేదా వాటి రుణాలను పరిష్కరించడం వంటి విషయాలను ఇది విచారిస్తుంది. అంతేకాకుండా, రెండు లేదా అంతకంటే ఎక్కువ కంపెనీల మధ్య విలీనాలు, ఒక కంపెనీని విభజించడం లేదా కార్పొరేట్ పునర్నిర్మాణానికి సంబంధించిన నిర్ణయాలను కూడా ఇది ఆమోదిస్తుంది. వాటాదారులు, కంపెనీ యాజమాన్యం మధ్య వివాదాలను, లేదా నష్టాల్లో ఉన్న కంపెనీ చట్టపరమైన లిక్విడేషన్‌ను కూడా ఎన్‌సిఎల్‌టి పర్యవేక్షిస్తుంది. క్లెయిమ్‌లోని ప్రతి ₹100కి రికవరీ మొత్తం కేవలం మూడు పైసలు మాత్రమే. ఈ కేసు ఒక ముఖ్యమైన ప్రశ్నను లేవనెత్తుతోంది..దివాలాలను పరిష్కరించడానికి, రుణాలను వసూలు చేయడానికి ఒక ఆధునిక చట్రాన్ని సృష్టించేందుకు దివాలా, బ్యాంక్రప్టసీ కోడ్, 2016ను రూపొందించారు. ఈ చట్టం కంపెనీలకు, కార్పొరేట్ రుణగ్రహీతలకు పూర్తిగా వర్తిస్తుంది. అయితే, వ్యక్తులు, భాగస్వామ్య సంస్థల దివాలా, బ్యాంక్రప్టసీకి సంబంధించిన ఐబిసిలోని పార్ట్ 3, సాధారణ ప్రజల కోసం ఇంకా పూర్తిగా అమలు కాలేదు.ఒక ముఖ్యమైన మినహాయింపు ఉంది. ఐబిసి ప్రకారం, ఒక కంపెనీ లేదా భాగస్వామ్య సంస్థ తీసుకున్న కార్పొరేట్ రుణానికి ఒక వ్యక్తి వ్యక్తిగత హామీ ఇచ్చి, ఆ తర్వాత రుణగ్రహీత చెల్లింపులో విఫలమైతే, ఆ వ్యక్తి దివాలా ప్రక్రియను ఎదుర్కోవలసి వస్తుంది. అందుకే పెద్ద కార్పొరేట్ రుణాలకు సంబంధించిన కేసులలో వ్యక్తిగత దివాలా ప్రక్రియలను ప్రారంభించవచ్చు. అప్పుల్లో ఉన్న వ్యక్తి కేవలం ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లి దివాలా ప్రకటించుకోలేరు. వారు సాధారణంగా సంబంధిత న్యాయస్థానానికి వెళ్లి, అధికారిక న్యాయ ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుంది. అప్పులు తీసుకున్న వ్యక్తి ఒక న్యాయవాది సహాయంతో దివాలా కోసం దరఖాస్తు చేసుకోవాలి. అప్పులు ఇచ్చిన సంస్థలు, చెల్లించాల్సిన అప్పులు, ఆస్తులు, ఆదాయంతో సహా తమ ఆర్థిక పరిస్థితికి సంబంధించిన సమాచారాన్ని అందించాలి. ఆ వ్యక్తి తాము నిజంగా తమ ఆర్థిక బాధ్యతలను నెరవేర్చలేకపోతున్నామని, తమ అప్పులు చెల్లించే సామర్థ్యానికి మించి ఉన్నాయని నిరూపించుకోవాలి. ఆ తర్వాత న్యాయస్థానం కేసును విచారిస్తుంది, సంబంధిత పార్టీల వాదనలు వింటుంది. అవసరమైన విచారణలు జరుపుతుంది. దివాలా ప్రకటించడం అంటే కేవలం అప్పుల నుంచి విముక్తి పొందడం మాత్రమే కాదు. ఇది ఒక వ్యక్తి ఆస్తులు, ఆర్థిక పరిస్థితులు, భవిష్యత్ అవకాశాలపై తీవ్రమైన ప్రభావం చూపుతుంది. ఇందులో అత్యంత ముఖ్యమైన పరిణామం వ్యక్తిగత ఆస్తుల అమ్మకం. అప్పటి పరిస్థితులు, వర్తించే చట్టాలను బట్టి, ఇల్లు, కారు లేదా ఆభరణాలు వంటి ఆస్తులను దివాలా ప్రక్రియలో చేర్చి, రుణదాతలకు చెల్లించడానికి ఉపయోగించవచ్చు. కొన్ని ముఖ్యమైన వస్తువులను కాపాడుకోగలిగినప్పటికీ, దివాలా అంటే ఒక వ్యక్తి తన ఆస్తులన్నింటినీ ఉంచుకొని, అప్పులన్నీ తీరిపోతాయని కాదు. ఒక వ్యక్తి ఆర్థిక ప్రతిష్ట కూడా తీవ్రంగా దెబ్బ తింటుంది. ఫలితంగా భవిష్యత్తులో రుణాలు పొందే సామర్థ్యంపై తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. దీనివల్ల సాంప్రదాయ బ్యాంకింగ్ క్రెడిట్ సేవలను పొందడం కష్టమవుతుంది.

# కాంగ్రెస్‌లోనే ఉంటారా..?



- మంత్రి పదవి పోయింది
- పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘన కారణంగా కాంగ్రెస్ అధిష్ఠానం ఈ నిర్ణయం
- ఇప్పుడు కొండా సురేఖ చూపు ఎటువైపు..?

జయభేరి, హైదరాబాద్ :

ఒకసారి మంత్రి పదవి దక్కితే.. దాన్ని కాపాడుకోవడానికి ముఖ్యమంత్రిని, పార్టీ అధిష్ఠానాన్ని ప్రసన్నం చేసుకోవడం చాలామంది నేతలు చేసే పని. కానీ కొండా సురేఖ రాజకీయ శైలి మాత్రం అందుకు పూర్తి భిన్నం. పదవిలో ఉన్నా.. లేకపోయినా తనదైన దూకుడుతో వ్యవహరించడం, అవసరమైతే సొంత పార్టీలోని నేతలపైనే ఎదురుదాడికి దిగడం ఆమె రాజకీయ ప్రస్థానంలో చాలాసార్లు కనిపించింది. ఇప్పుడు అదే దూకుడు మరోసారి ఆమె మంత్రి పదవికే ఎసరు పెట్టిందనే చర్చ తెలంగాణ రాజకీయాల్లో జోరుగా సాగుతోంది. కూతురు కొండా సుష్మిత చేసిన వ్యాఖ్యలతో మొదలైన వివాదం చివరకు మంత్రి కొండా సురేఖను రేవంత్ రెడ్డి మంత్రివర్గం నుంచి తప్పించే స్థాయికి వెళ్లింది. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నేతలపై సుష్మిత చేసిన తీవ్ర వ్యాఖ్యలను పార్టీ క్రమశిక్షణ సంఘం సీరియస్‌గా తీసుకుంది. ఆ కమిటీ సిఫారసుల అనంతరం కాంగ్రెస్ అధిష్ఠానం ఆమోదంతో సురేఖను కేబినెట్ నుంచి తొలగించే ప్రక్రియ మొదలైంది. ఈ పరిణామంతో తెలంగాణ కాంగ్రెస్‌లో మరోసారి అంతర్గత విభేదాలు బహిర్గతమయ్యాయి. అయితే తనపై తీసుకున్న చర్యను కొండా సురేఖ తీవ్రంగా వ్యతిరేకించారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదని, తన వివరణ తీసుకోకుండానే మంత్రి పదవి నుంచి తొలగించారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను పదవి నుంచి తొలగించడం వెనుక కుట్ర ఉందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీ అధిష్ఠానంపై ఒత్తిడి తెచ్చారని ఆమె ఆరోపించారు. తన కుమార్తె స్వతంత్రంగా చేసిన వ్యాఖ్యలకు తాను ఎలా బాధ్యత వహిస్తానని కూడా ప్రశ్నించారు. ఇవన్నీ ఆమె చేసిన ఆరోపణలేనని, కాంగ్రెస్ వైపు నుంచి మాత్రం పార్టీ క్రమశిక్షణే ప్రధాన కారణంగా చెబుతున్నారు. ఇది కొండా సురేఖ రాజకీయ జీవితంలో ఎదురైన తొలి పెద్ద పార్టీ అంతర్గత సంక్షోభం కాదు. గతంలోనూ ఆమె తన దూకుడు నిర్ణయాలతో వార్తల్లో నిలిచారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి మంత్రివర్గంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేసిన సురేఖ.. వైఎస్ మరణం తర్వాత తనకు నచ్చని రాజకీయ పరిణామాలపై నిరసనగా మంత్రి పదవికి రాజీనామా చేశారు. అనంతరం ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేసి వైఎస్ జగన్‌కు మద్దతుగా వైసీపీలో చేరారు. ఆ తర్వాత వైసీపీని వీడి బీఆర్ఎస్‌లోకి వెళ్లారు. 2014లో వరంగల్ తూర్పు నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచారు. 2018లో టికెట్ దక్కకపోవడంతో ఆ పార్టీని వీడి తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. 2023లో మరోసారి వరంగల్ తూర్పు నుంచి గెలిచి రేవంత్ రెడ్డి కేబినెట్‌లో చోటు దక్కించుకున్నారు. ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కొండా సురేఖకు రాజకీయంగా ఎంత బలం ఉందో.. అంతే స్థాయిలో వివాదాలు కూడా వెంటాడాయి. 2024లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై విమర్శలు చేసే క్రమంలో సినీ నటుడు నాగార్జున కుటుంబం, నాగచైతన్యసమంత విడాకుల వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ ఆమె చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా సంచలనంగా మారాయి. ఆ వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు రావడంతో పాటు నాగార్జున పరువు నష్టం దావా కూడా వేశారు. చివరకు సురేఖ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణలు చెప్పారు. ఆ తర్వాత కూడా కొండా దంపతుల వ్యవహార శైలిపై కాంగ్రెస్‌లోనే అసంతృప్తి వ్యక్తమైంది. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు తమ నియోజకవర్గాల్లో కొండా దంపతుల జోక్యం ఎక్కువైందంటూ అధిష్ఠానానికి ఫిర్యాదులు చేసినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. మేడారం పనుల టెండర్ల విషయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో విభేదాలు బయటపడటం, ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాల్లో ఆధిపత్య పోరు కనిపించడం వంటి పరిణామాలు కూడా సురేఖను తరచూ వార్తల్లో నిలిపాయి. కొండా మురళి సైతం పలు సందర్భాల్లో ప్రభుత్వంలోని ఇతర నేతలపై బహిరంగంగా విమర్శలు చేయడం వివాదాలకు మరింత ఆజ్యం పోసింది. మాజీ ఓఎస్డీ సుమంత్ వ్యవహారం కూడా కొండా కుటుంబానికి, రేవంత్ ప్రభుత్వానికి మధ్య దూరాన్ని పెంచిన పరిణామాల్లో ఒకటిగా నిలిచింది. సుమంత్‌ను అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు కొండా సురేఖ నివాసానికి వెళ్లిన సమయంలో ఆమె కుమార్తె సుష్మిత అభ్యంతరం వ్యక్తం చేయడం, ఆ తర్వాత రాజకీయ కుట్ర ఆరోపణలు తెరపైకి రావడం అప్పట్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఇలా చూస్తే ప్రత్యర్థి పార్టీలతో రాజకీయ పోరాటం చేయడం ఎంతగా కనిపిస్తుందో.. సొంత పార్టీలోనూ కొండా కుటుంబం చుట్టూ అంతే స్థాయిలో వివాదాలు కనిపిస్తున్నాయనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో ఉంది. ఇప్పుడు తాజాగా కూతురు సుష్మిత వ్యాఖ్యల వ్యవహారం మాత్రం పరిస్థితిని పూర్తిగా మార్చేసింది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించే వ్యాఖ్యలను కాంగ్రెస్ అధిష్ఠానం సహించదనే సంకేతాన్ని ఈ చర్య ద్వారా ఇచ్చిందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో సురేఖ మాత్రం తాను కాంగ్రెస్‌ను వీడే ఆలోచన లేదని, ఎమ్మెల్యేగా కొనసాగుతానని స్పష్టం చేశారు. దీంతో మంత్రి పదవి పోయిన తర్వాత ఆమె కాంగ్రెస్‌లోనే కొనసాగుతారా? లేక భవిష్యత్తులో మరో రాజకీయ వేదిక వైపు అడుగులు వేస్తారా? అన్న చర్చ మొదలైంది. మరోవైపు బీజేపీ నేతల నుంచి ఆమెకు ఆహ్వానాలు ఉన్నాయన్న ప్రచారం కూడా రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. బీజేపీ ఎంపీ అరవింద్‌తో పాటు బండి సంజయ్, ఈటల రాజేందర్ వంటి నేతల నుంచి సానుకూల సంకేతాలు ఉన్నాయనే చర్చ సాగుతోంది. జనసేన, బీఆర్ఎస్ వైపు కూడా అవకాశాలను పరిశీలించే అవకాశం ఉందన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే ఇవన్నీ ప్రస్తుతానికి రాజకీయ చర్చలు, ప్రచారాలకే పరిమితం. సురేఖ మాత్రం కాంగ్రెస్‌లోనే ఎమ్మెల్యేగా కొనసాగుతానని చెప్పడం గమనార్హం.

మొత్తంగా చూస్తే.. కొండా సురేఖ రాజకీయ ప్రస్థానం ఒక సాధారణ ఎమ్మెల్యే నుంచి రెండుసార్లు మంత్రి స్థాయికి ఎదిగిన ప్రయాణం మాత్రమే కాదు. పదవి కోసం రాజీ పడకుండా తనదైన దూకుడుతో రాజకీయాలు చేయడం, అవసరమైతే సొంత పార్టీలోనే ప్రశ్నించడం, ఆ తర్వాత అదే దూకుడు వివాదాలకు కారణం కావడం.. ఆమె రాజకీయ జీవితంలో పదేపదే కనిపించిన పరిణామాలు. ఇప్పుడు మంత్రి పదవి కోల్పోయిన తర్వాత అసలు పరీక్ష మొదలైంది. కాంగ్రెస్‌లోనే కొనసాగుతూ తన రాజకీయ బలాన్ని నిరూపించుకుంటారా? లేక కొత్త రాజకీయ దారిని ఎంచుకుంటారా? కొండా కుటుంబం తదుపరి అడుగు ఏంటన్నది తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

## ముఖ్యమంత్రీ.. చెత్త పనులు మానుకో

జీతగాళ్లుగా మార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం దారుణమన్నారు. స్వయం ఉపాధి ద్వారా మంచి ఆదాయం పొందుతున్న వారికి నెలకు రూ.16 వేలు మాత్రమే జీతం ఇచ్చేలా రేవంత్ రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు.

**చెత్త పైసలపై ముఖ్యమంత్రి కన్నుపడింది**

చెత్త పైసలపై ముఖ్యమంత్రి కన్నుపడిందని కవిత మండిపడ్డారు. హైదరాబాద్ లో 20 వేల ఆటోల ద్వారా 40 వేల మంది స్వచ్ఛ ఆటో కార్మికులు ఇంటింటి నుంచి చెత్త సేకరిస్తూ స్వయం ఉపాధి పొందుతున్నారని తెలిపారు. చెత్త సేకరిస్తున్న ఇంటి నుంచి నామమాత్రంగా ఛార్జ్ చేస్తూ ఒక్కో కుటుంబం నెలకు రూ.50 వేల వరకు సంపాదించుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వంపై రూపాయి భారం వేయకుండా నగరాన్ని స్వచ్ఛంగా ఉంచుతూ ఉపాధి పొందుతున్న వారిపై ఆదాయంపై ముఖ్యమంత్రి కన్ను పడటం దారుణమన్నారు. రాంకీ సంస్థ కోసం ఇప్పుడు వారి ఉపాధికి ఎసరు పెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రజల నుంచి వారికి డబ్బులు రాకుండా చెత్త ట్యాక్స్ ను ప్రాపర్టీ ట్యాక్స్ లో కలపాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని.. దీని ద్వారా 20 వేల స్వచ్ఛ ఆటో కార్మికులు ఉపాధి కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. స్వచ్ఛ కార్మికులను రాంకీకి జీతగాళ్లుగా మార్చి నెలకు రూ.16 వేల జీతం మాత్రం ఇస్తామనడం దారుణమన్నారు. నెలకు రూ.16 వేలతో స్వచ్ఛ ఆటో కార్మికులు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. చెత్త సేకరణ కాంట్రాక్టు రాంకీకి ఇచ్చే ప్రయత్నాలు విరమించుకోవాలని, చెత్త సేకరణ యథావిధిగా కార్మికులతోనే చేయించాలని డిమాండ్ చేశారు.

**ముఖ్యమంత్రి ఇంటి ముందు వెయ్యి ఆటోల చెత్త పోస్తాం**

స్వచ్ఛ ఆటో కార్మికులకు అన్యాయం చేస్తామంటే తెలంగాణ రక్షణ సేన ఊరుకోదని కవిత హెచ్చరించారు. భయపడితే, బెదిరిస్తే బెదిపోవద్దని కార్మికులకు సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో కార్మికులకు అన్యాయం జరగనివ్వనని హామీ ఇచ్చారు. రాంకీకి కాంట్రాక్టు ఇచ్చే ప్రతిపాదనను వెనక్కి తీసుకోకపోతే సీఎం ఇంటి ముందు వెయ్యి ఆటోల చెత్త పోస్తామని హెచ్చరించారు.

**కార్మికులు సైనికులతో సమానం**

ప్రభుత్వంతో సంబంధం లేకుండా స్వయం ఉపాధి పొందుతున్న స్వచ్ఛ ఆటో కార్మికులు సైనికులతో సమానమని కవిత అన్నారు. దేశాన్ని రక్షిస్తున్న సైనికులకు ఎంత గౌరవమిస్తామో నగరాన్ని స్వచ్ఛంగా ఉంచుతున్న స్వచ్ఛ ఆటో కార్మికులకు అంతే గౌరవమివ్వాలని సూచించారు. స్వచ్ఛ ఆటో కార్మికులకు ప్రభుత్వం రూ.20 లక్షల ఇన్సూరెన్స్ చేయాలన్నారు. రాంకీ సంస్థ నిర్వహిస్తున్న డంపింగ్ యార్డ్ వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. అసెంబ్లీ సమావేశాల్లోనే ఈ అంశంపై ముఖ్యమంత్రి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో స్వచ్ఛ ఆటో కార్మికులు పాల్గొన్నారు.

# ఇంటర్ విద్యను తీసేయడమంటే కొరివితో తలగొక్కున్నట్టే..

- మెడకాయ మీద తలకాయ ఉన్నోడెవడూ ఇంటర్ విద్యను రద్దు చేయాలనుకోడు: కవిత
- సీఎం రేవంత్ తీరు చూస్తే తుగ్లక్ కూడా సిగ్గుపడాల్సిందే..
- ఇంటర్ విద్యను టచ్ చేస్తే 2028 దాకా సీఎంగా ఉంటారో లేదో చూసుకోవాలి: జేఏసీ హెచ్చరిక
- 'సేవ్ ఇంటర్ ఎడ్యుకేషన్' సదస్సులో సర్కార్ తీరుపై భగ్గుమన్న వక్తలు




**జయభేరి, హైదరాబాద్:**

మెడకాయ మీద తలకాయ ఉన్నోడు ఎవరూ ఇంటర్మీడియట్ విద్యను తీసేస్తామని అనరని బీఆర్ఎస్ నేత, తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇంటర్ విద్య విధానంపై సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రకటనలు చూస్తుంటే తుగ్లక్ కూడా సిగ్గుపడతాడని ఎద్దేవా చేశారు. నాంపల్లిలోని మీడియా అకాడమీలో శుక్రవారం జరిగిన 'సేవ్ ఇంటర్ ఎడ్యుకేషన్' జంగ్ సైరన్ సదస్సులో ఆమె ముఖ్య వక్తగా పాల్గొని సర్కార్ తీరుపై నిప్పులు చెరిగారు. దేశంలోనే నంబర్ వన్ గా ఉన్న ఇంటర్ విద్యను టచ్ చేస్తే విద్యార్థుల తల్లిదండ్రులు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

**తుగ్లక్‌ను మించిన పాలకుడు!**

సదస్సులో కవిత మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యను తీసేయాలన్న ముఖ్యమంత్రి నిర్ణయంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పిచ్చి పనులు చేసే పాలకుడిని గతంలో తుగ్లక్ అనేవారని, ఇప్పుడు రేవంత్ రెడ్డిని అలాగే అనాల్సి వస్తోందని మండిపడ్డారు. కీలకమైన నిర్ణయాలు తీసుకునే ముందు మేధావులు, సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్‌తో మాట్లాడాలని, ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటే బెడిసికొడుతాయన్నారు. మీటింగ్‌లో సడన్‌గా ఈ ఏడాది నుంచి ఇంటర్ అడ్మిషన్లు ఉండవని సీఎం అంటారని, రెండు రోజులకే ఇంటర్ బోర్డు అడ్మిషన్ల ప్రక్రియ ఇస్తుందని.. దీన్నిబట్టి ముఖ్యమంత్రి మాటకు ఎంత విలువ ఉందో అర్థం చేసుకోవచ్చని ఎద్దేవా చేశారు. సీఎం పదవికి ఉన్న డిగ్నిటీని కాపాడాలని హితవు పలికారు.

**కొరివితో తలగొక్కున్నట్టే..**

ఇంటర్మీడియట్ విద్యను తీసేయాలనుకోవడం కొరివితో తలగొక్కున్నట్లేనని కవిత హెచ్చరించారు. ఇప్పుడున్న ఇంటర్ విద్యతో ఎలాంటి సమస్య లేదని, దాన్ని మార్చాల్సిన అవసరం లేదన్నారు. మన ఇంటర్ విద్య పటిష్టంగా ఉండటంతోనే ప్రపంచ ప్రఖ్యాత కంపెనీల్లో ఉన్న ఇంజనీర్లలో తెలుగువాళ్లే ఎక్కువగా ఉన్నారని చెప్పారు.
తాను కూడా ఇంటర్ విద్య ద్వారా ప్రయోజనం పొందిన వ్యక్తినేనని గుర్తుచేశారు. ఈ ఏడాది మాత్రమే ఇంటర్ ఉంటుందని, వచ్చే ఏడాది ఉండకపోవచ్చని సీఎం చెబుతున్నారని, ఇంటర్ విద్య లేకుంటే విద్యార్థుల తల్లిదండ్రులే ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతుంటే భయమవుతోందని, ఇంజనీరింగ్ విద్య వేస్ట్ అనడం, వైట్ కాలర్ జాబ్స్ వదిలేసి బ్లూ కాలర్ జాబ్స్ వెతుక్కోవాలని అనడం సరికాదన్నారు. విద్యా కమిషన్, కేకే కమిషన్ పేరుతో కాలయాపన చేస్తున్నారని మండిపడిన ఆమె.. పొలిటికల్ విల్ ఉంటే ఉచిత విద్య, వైద్యం కచ్చితంగా సాధ్యమని స్పష్టం చేశారు.

**ఇంటర్ విద్యను తాకితే కుర్చీ ఊడుద్ది: మధుసూధన్ రెడ్డి**

ఇంటర్ విద్యా జేఏసీ చైర్మన్ మధుసూధన్ రెడ్డి మాట్లాడుతూ సర్కార్ తీరును తీవ్రంగా తప్పుబట్టారు. ఫిన్లాండ్‌కు వెళ్లి అక్కడి విద్యారంగం పరిస్థితిని పరిశీలించే తీరిక ఉన్న ఉన్నతాధికారులకు, పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో ఏం జరిగిందో తెలుసుకునే సోమరితనం పట్టడం లేదని విమర్శించారు. కాశ్మీర్ ఎన్ఐటీలోనూ 50 శాతం మంది విద్యార్థులు తెలుగు వారే ఉండటానికి ఇక్కడి ఇంటర్ విద్యా విధానమే కారణమని స్పష్టం చేశారు.
తెలుగు రాష్ట్రాల్లోని ఇంటర్ వ్యవస్థ నచ్చడంతో ఇతర రాష్ట్రాల విద్యార్థులు కూడా ఇక్కడ చదువుకునేందుకు వస్తుంటే, సీఎం రేవంత్ రెడ్డి దీన్ని పాఠశాల విద్యలో విలీనం చేయాలనుకోవడం సహేతుకంగా లేదన్నారు. ఏపీ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ఇంటికి పంపించినట్టే, సీఎం రేవంత్ రెడ్డిని కూడా ఇంటికి పంపించేందుకు కుట్రలు జరుగుతున్నాయని మధుసూధన్ రెడ్డి అనుమానం వ్యక్తం చేశారు. విద్యా కమిషన్ మాజీ చైర్మన్ ఆకునూరి మురళి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారుగా ఇచ్చిన సలహాలే జగన్‌ను ముంచాయని, తనకు తానే మేధావి అని చెప్పుకునే కొంతమంది ఇచ్చే ఇలాంటి సలహాలు ప్రభుత్వం పాటించొద్దని హితవు పలికారు.
దివంగత ప్రధాని పీవీ నరసింహారావు దూరదృష్టితో తెచ్చిన ఇంటర్ విద్య.. ఉన్నత విద్యకు మొదటి మెట్టు అని, కొఠారి సిఫారసులు, లోతైన విశ్లేషణ తర్వాతే దీన్ని దేశవ్యాప్తంగా అందుబాటులోకి తెచ్చారని గుర్తుచేశారు. డ్రాప్ అవుట్లు తగ్గించేందుకే విలీనం చేస్తున్నామనేది వట్టి సాకు మాత్రమేనని కొట్టిపారేశారు. రాష్ట్రంలో 10 లక్షల మంది విద్యార్థులు, 20 లక్షల మంది తల్లిదండ్రులు, 6 వేల మంది బోధనా సిబ్బంది, 4 వేల మంది బోధనేతర సిబ్బందితో ప్రత్యేకంగా ఉండి అద్భుత ఫలితాలిస్తున్న ఈ వ్యవస్థను అలాగే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ విలీన యోచనను విరమించుకోకపోతే విద్యార్థులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి 2034 వరకు సీఎంగా ఉంటానని ప్రచారం చేసుకుంటున్నారని, కానీ ఇంటర్ విద్యను ముట్టుకుంటే 2028 వరకు ఆయన సీఎంగా ఉంటారా అనేది కూడా అనుమానమేనని తీవ్రంగా స్పష్టం చేశారు. ఈ సదస్సులో జేఏసీ సెక్రటరీ జనరల్ కృష్ణకుమార్, కో చైర్మన్ కనకచంద్రం, నేతలు మాధవరావు, బలరాం జాదవ్, రజిత, కవిత కిరణ్, లక్ష్మీ, శివకుమార్, యాకుబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.



## ముగిసిన అఖండ భజన

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రధాన దేవాలయమైన మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం అఖండ భజన పూజా కార్యక్రమాన్ని ముగించారు. దేవాలయంలో కృష్ణాష్టమి మరియు హనుమద్దాసుల జయంతి సందర్భంగా ఈనెల 3న అఖండ భజన కార్యక్రమం ప్రారంభమైంది. దాదాపు 24 గంటల పాటు భక్తులు ఈ అఖండ భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ అఖండ భజన కార్యక్రమంలో పాల్గొన్న భజన మండలి సభ్యులను దేవస్థానం చైర్మన్, వంశపారం పర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అళహరి రామకృష్ణలు ఘనంగా సన్మానించారు. అలాగే వారికి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేష్, నరసింహయ్య, దేవస్థానం పురోహితులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వాసవి మాత పల్లకి సేవ

- అలంకరణలో దర్శనం ఇచ్చిన అమ్మవారు



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారి పల్లకి సేవ పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి శుక్రవారం అమ్మవారి పల్లకి సేవ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే దేవస్థానం ప్రధాన అర్చకుడు హరిశంకర శర్మ ఆధ్వర్యంలో ఈ పవిత్ర పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, సాంప్రదాయ రీతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పల్లకిలో తీసుకొని దేవాలయం చుట్టూ ప్రదక్షణలు నిర్వహించారు. పురోహితుల వేదమంత్రాలు, భక్తుల హరినామశ్చరణల మధ్య ఈ సేవ ముందుకు కదిలింది. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. నీతో వాసవి మాత అమ్మవారు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే సామూహిక కుంకుమార్చన పూజా కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ కల్వ కన్నయ్య శెట్టి, మహిళా సంఘం అధ్యక్షురాలు గుద్దేటి మంజులరాణి, జిల్లా మాజీ అధ్యక్షుడు గుద్దేటి చంద్రయ్య, దోమ హరికాంత్ లతోపాటు స్థానిక ఆర్యవైశ్యులు, భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## లలితాదేవి అలంకరణలో వాసవి మాత అమ్మవారు దర్శనం



**జయభేరి, దేవరకద్ర :**


మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో కొలువుదీరిన ఈ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు శుక్రవారం లలితా దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. శ్రావణమాసం 4వ శుక్రవారం సందర్భంగా అమ్మవారిని లలితా దేవి అలంకరణలో అలంకరించారు. దీంతో అమ్మవారు లలితాదేవి అలంకరణలో భక్తకోటికి దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా దేవస్థానం ప్రధాన అర్చకుడు తరిమల హరిశంకర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కి వివిధ పూజలు నిర్వహించారు.

## బీఆర్ఎస్ నిరసన 3వ రోజు వంటా వార్పు కార్యక్రమం



**జయభేరి, కొండమల్లేపల్లి :**

కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల దగా పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు బీఆర్ఎస్ శ్రేణులు చేపడుతున్న వారం రోజుల నిరసన కార్యక్రమాల్లో భాగంగా మూడో రోజు కొండమల్లెపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద "వంటా వార్పు" కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసి 1000 రోజులు గడిచినా ఒక్క హామీ కూడా పూర్తిగా అమలు చేయలేదని, రైతులు, మహిళలు, యువకులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, అందుకే బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన వారం రోజుల పాటు నిరసన కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వద్యా రమేష్ నాయక్, భీల్య నాయక్, కిషన్ నాయక్ బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని దేవరకద్ర మండలం గోపన్ పల్లి లో శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సంప్రదాయ రీతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుని అలంకరణలో చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నారు. విశేష దినోత్సవం దినోత్సవం పరిష్కరించుకొని దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**జయభేరి, దేవరకొండ :**


దేవరకొండ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో 4వ శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి గాజుల పూజ, అమ్మవారికి అభిషేక అష్టోత్తరాలు, సాయంత్రం శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా చిన్ని కృష్ణుడికి అభిషేకాలు ఉయ్యాల సేవ వైభవంగా నిర్వహించారు. చిన్నారులు రాధాకృష్ణుల అవతారంలో చిన్నారులు నృత్య ప్రదర్శన నిర్వహించినారు. రాధాకృష్ణ వేషధారణలో వచ్చిన చిన్నారులకు బహుమతులు ప్రధానం చేసినారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు చీదెళ్ల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సముద్రాల ప్రభాకర్, కోశాధికారి కొత్త సుబ్బారావు ఆలయ కమిటీ సభ్యులు, సంఘం సభ్యులు వాసవి మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిరసనగా "వంటా వార్పు"

**జయభేరి, ఉప్పల్ :**



కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన "వంటా వార్పు" నిరసన కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని డా. ఏఎస్ రావు నగర్, వంపుగూడ, మల్లాపూర్(అశోక్ నగర్), నాచారం, రామంతాపూర్ ప్రాంతాల్లో నిర్వహించిన వంటా వార్పు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. మహిళలకు నెలకు ₹2,500, కేసీఆర్ కిట్, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలలో తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఎమ్మెల్యే విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు.
కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న నిరసన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్ లు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






# శ్రీకృష్ణుడి బోధనలు స్ఫూర్తిదాయకం

- ధర్మం, శాంతి, సౌభ్రాతృత్వం కోసం ఆచరించాలి
- జెమ్మిగడ్డలో రాధాకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు
- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**జయభేరి, కాప్రా :**

శ్రీకృష్ణుడి జీవితం, బోధనలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ధర్మాన్ని కాపాడుతూ సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ శ్రీకృష్ణుడి బోధనలను ఆచరించాలని సూచించారు. కాప్రా సర్కిల్ డాక్టర్ ఏఎస్‌రావునగర్ డివిజన్ పరిధిలోని జెమ్మిగడ్డలో శ్రీ రాధాకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో రమేశ్ యాదవ్ శుక్రవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ జనార్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, తదితరులు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాధాకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. శ్రీకృష్ణుడి బోధనలు నేటి సమాజానికి ఎంతో అవసరమని మాజీ కార్పొరేటర్లు పేర్కొన్నారు. ధర్మం, సత్యం, న్యాయం కోసం పోరాడే స్ఫూర్తిని శ్రీకృష్ణుడి జీవితం అందిస్తుందని తెలిపారు. ఇలాంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏటా నిర్వహించడం ద్వారా యువతలో మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెరుగుతుందని అన్నారు. సంఘం అభివృద్ధికి, స్థానిక ప్రజల సంక్షేమానికి తమ వంతు సహకారం అందిస్తామని నాయకులు హామీ ఇచ్చారు. శ్రీకృష్ణుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కృష్ణాష్టమి సందర్భంగా నిర్వహించిన పూజలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. వేడుకలను విజయవంతం చేసిన శ్రీ రాధాకృష్ణ యాదవ సంఘం సభ్యులను పలువురు ప్రముఖులు అభినందించారు. జైజవాన్ కాలనీ తిరుమలయ్య యాదవ్ సహకారంతో అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ రాధా కృష్ణ యాదవ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## శేరిపల్లి పాఠశాలలో ఘనంగా పాఠశాల రూపాంతర కార్యక్రమం

**జయభేరి, వర్గల్, సెప్టెంబర్ 04 :**

సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం శేరిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని శేరిపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో జన్మాష్టమి సందర్భంగా పాఠశాల రూపాంతర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. థామ్సన్ రాయిటర్స్, మ్యాజిక్ బస్ సంస్థల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు.పాఠశాలకు వైట్‌వాష్ చేయడంతో పాటు ఆకర్షణీయమైన మ్యూరల్ ఆర్ట్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాలకు అవసరమైన ఫర్నిచర్‌ను థామ్సన్ రాయిటర్స్ సంస్థ అందించింది. దీంతో పాఠశాల ఆహ్లాదకరంగా, ఆకర్షణీయంగా మారింది.అనంతరం నిర్వహించిన జన్మాష్టమి వేడుకల్లో విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో నృత్య ప్రదర్శనలు చేసి ఆకట్టుకున్నారు. విద్యార్థుల ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పావనిమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాల రూపాంతరానికి సహకరించిన థామ్సన్ రాయిటర్స్, మ్యాజిక్ బస్ సంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల రూపాంతరం వల్ల విద్యార్థులకు మెరుగైన, ఆహ్లాదకరమైన అభ్యాస వాతావరణం ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో థామ్సన్ రాయిటర్స్, మ్యాజిక్ బస్ సంస్థల ఉద్యోగులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు. పాఠశాల రూపాంతరంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు.

## భూమి హక్కుల పరిరక్షణకు బీజేపీ ఉద్యమం



**జయభేరి, తుర్కపల్లి, సెప్టెంబర్ 4 :**

రైతుల భూముల హక్కుల కోసం బిజెపి ప్రభుత్వం పోరాటం చేస్తుందని బిజెపి జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్ అన్నారు. శుక్రవారం తుర్కపల్లి మండల కేంద్రంలో మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో భూభారతి 22 ఏ సమస్యపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22 ఏ మెసేజ్ జాబితాలో ప్రైవేటు భూములు ఇండ్ల స్థలాలు చేరడంతో రైతులు పేదలు, మధ్యతరగతి ప్రజలు తీవ్ర బంధువులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అప్పుడు టిఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల జీవితాలతో ఆటలాడుతున్నాయని ప్రభుత్వాలు మారుతున్న రైతులకు సమస్యలను మాత్రం శాశ్వత పరిష్కారం లభించడం లేదని అన్నారు రైతు కష్టపడి సంపాదించుకున్న భూమిపై రైతుకే హక్కు లేకుండా చేసే పరిస్థితిని బిజెపి చూస్తూ ఊరుకోదని అన్నారు. ఈ సమస్యపై బిజెపి శాసన సభ పక్షా నేత ఏలేటి రాజేశ్వర్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ ఐదున హైదరాబాదులో ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మహా దీక్షకు 22 ఏ బాధిత రైతులు, యజమాన్యులు బిజెపి నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. రైతుల భూముల హక్కుల కోసం ప్రజల న్యాయం కోసం బిజెపి చేసే పోరాటానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన మోర్చా ఉపాధ్యక్షుడు నరేష్, జిల్లా కార్యదర్శి కోకొండ లక్ష్మీనారాయణ గౌడ్, జిల్లా మీడియాకు కన్వీనర్ బానోతు శంకర్ నాయక్, రాష్ట్ర రైడర్ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కందుకూరి చిన్న చలమయ్య, రాష్ట్ర మైనార్టీ మోర్చా కార్యవర్గ సభ్యులు చాంద్ పాషా, నాయకులు గోర్ల రామచంద్రం, గుండెబోయిన మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- బిఆర్ఎస్ రాష్ట నేత మద్దుల శ్రీనివాస్ రెడ్డి



**జయభేరి, మేడ్చల్:**


వంద రోజుల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామని ఎన్నికల సమయంలో ప్రజలకు హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వెయ్యి రోజులు పూర్తయినా ఒక్కో హామీని నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తోందని బీఆర్ఎస్ రాష్ట్ర నేత మద్దుల శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం గుండ్లపోచంపల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వంటావార్పు కార్యక్రమం నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మద్దుల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలును మాత్రం పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, రైతులకు రైతు భరోసా, రుణమాఫీ, పంటలకు బోనస్, నిరుద్యోగ భృతి, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, కళ్యాణలక్ష్మి కింద తులం బంగారం వంటి హామీలను కాంగ్రెస్ పార్టీ మారిచిందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పోలిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు జగన్ రెడ్డి, శ్రీనివాస్ రాజు, గణేష్, రాగ జ్యోతి, కౌన్సిలర్లు అమరం జైపాల్ రెడ్డి, భేరి బాలరాజు, అమరం హేమంత్ రెడ్డి, చింత పెంటయ్య, నాయకులు దాయనంద్ యాదవ్, బట్టికడి దేవేందర్, సంజీవ్ గౌడ్, రణదీప్ రెడ్డి, రామ్ యాదవ్, దొడ్ల మధు, శ్రీహరి, నరహరి, నాగరాజు పటేల్, విద్యాసాగర్, నర్సింగ్ యాదవ్, బండారి రాజు, బండారి శ్రీనివాస్, పెంటయ్య, నాగరాజు, రమేష్, మధు రెడ్డి, ప్రదీప్ వర్మ, దప్పు మహేష్, రాకేష్, మల్లికార్జున్, రమేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు
- ఆకట్టుకున్న చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు

**జయభేరి, మేడ్చల్:**

గుండ్లపోచంపల్లి యాదవ సంఘం అధ్యక్షుడు ఉనిగొర్ల నర్సింగ్ యాదవ్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. అనంతరం కృష్ణాష్టమి వేడుకల చిన్నారులు చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలో ముస్తాబై సందడి చేశారు. చిన్నారుల వేషధారణలు, కృష్ణుడి బాల్య లీలలను ప్రతిబింబించేలా చేసిన ప్రదర్శనలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తల్లిదండ్రులు తమ చిన్నారులను కృష్ణుడు, గోపికల వేషధారణలో తీసుకువచ్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన వెన్న ఉట్టిని కొట్టే కార్యక్రమంలో చిన్నారులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉట్టి కొట్టేందుకు పోటీపడుతూ సందడి చేయడంతో వేడుకల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. కృష్ణాష్టమిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.








శ్రీకృష్ణుడి పాటలకు చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారుల నృత్యాలను చూసిన కుటుంబ సభ్యులు, స్థానికులు చప్పట్లతో ప్రోత్సహించారు. భక్తి గీతాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో కార్యక్రమ ప్రాంగణం సందడిగా మారింది. ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులు మాట్లాడుతూ యాదవుల కులదైవంగా భావించే శ్రీకృష్ణుడి జన్మాష్టమి వేడుకలను ప్రతి ఒక్కరితో కలిసి భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. శ్రీకృష్ణుడి బోధనలు, ధర్మమార్గం, మానవతా విలువలను నేటి తరానికి తెలియజేయాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా యాదవ సంఘం ఆధ్వర్యంలో వేడుకలను వైభవంగా నిర్వహించామని, సంఘ సభ్యులు, మహిళలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారని పేర్కొన్నారు. వేడుకల నిర్వహణకు సహకరించిన సంఘం సభ్యులకు, కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ యాదవ సంఘం నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా సంఘం ఆధ్వర్యంలో మరిన్ని సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ ఐకమత్యాన్ని చాటుకుంటామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఉనిగొర్ల నర్సింగ్ యాదవ్, శంకర్ యాదవ్, నాగమల్లయ్య యాదవ్, పాండు యాదవ్, మల్లేష్ యాదవ్, చంద్రయ్య యాదవ్, మల్లేష్ యాదవ్, రామ్ యాదవ్, మహేష్ యాదవ్, సురేష్ యాదవ్, జగదీష్ యాదవ్, సంపత్ యాదవ్, నాగేష్ యాదవ్, మధు యాదవ్, మురళి యాదవ్, మోహన్ యాదవ్, శివ యాదవ్, రోహిత్ యాదవ్, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# పేదరికంపై పోరాట యాత్రకు రంగం సిద్ధం

- పేదరికం పై తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట అధ్యక్షులు కోతి ఇందిరా పోరాట యాత్రకు రంగం సిద్ధం
- 7 ప్రధాన డిమాండ్లతో ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి త్వరలో ప్రారంభం

**జయభేరి, నల్గొండ జిల్లా :**



ఉమ్మడి నల్గొండ జిల్లా పేదల బతుకుల్లో వెలుగు నింపేందుకు త్వరలో 'పేదరికంపై నా పోరాట యాత్ర' చేపట్టనున్నట్లు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు ప్రకటించారు. ఈ యాత్రను, ఈ ఉద్యమాల పురిటి గడ్డన ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి త్వరలో ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం అనే ప్రజాస్వామ్య అంతస్తులపై పౌరులందరినీ నిలబెట్టినా, నేటికీ సమానత్వం విషయంలో ధనవంతులకు పెద్దపీట వేస్తూ.. నేటికీ పేదల పట్ల వివక్ష కొనసాగుతూనే ఉంది. ఎన్ని ప్రభుత్వాలు మారినా క్షేత్రస్థాయిలో పేదరిక నిర్మూలన జరగడం లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు.

బీపీఎల్ కుటుంబాలకు భూమి, ఉపాధి, విద్య, వైద్యం, ప్రయాణం వంటి రంగాల్లో సమాన అవకాశాలు, గౌరవప్రదమైన జీవితం ఇప్పటికీ అందని ద్రాక్షగానే మిగిలిపోయిందన్నారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, వీటిని అదుపు చేయకపోతే భవిష్యత్తులో పేద, మధ్యతరగతి ప్రజలు చరిత్ర పుటల్లో మాత్రమే కనిపించే దుస్థితి వస్తుందని హెచ్చరించారు. పేదరికానికి అండగా నిలబడటమే తమ కమిటీ ప్రధాన లక్ష్యమని, ఈ పోరాట యాత్ర ద్వారా ప్రభుత్వాలను నిలదీస్తామని కోతి ఇందిరా స్పష్టం చేశారు. యాత్రలోని 7 ప్రధాన డిమాండ్లు త్వరలో వెల్లడిస్తామని మండల స్థాయిలో పేదరికంపై అవగాహన శిక్షణ తరగతులు అనంతరం బహిరంగ సభను ఏర్పాటు చేసి కార్యాచరణను ప్రకటిస్తామని ఆయన తెలిపారు. ప్రజా సమస్యలపై తాను 2023లో చేపట్టిన 'మీ గ్రామానికి దళిత ఆత్మబంధువు యాత్ర'కు ప్రజల నుంచి అశేష స్పందన లభించిందని అన్నారు. గత యాత్ర ద్వారా పల్లె పల్లెలోని దళితుల కష్టాలు, వారి సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకున్నామన్నారు. అదే స్ఫూర్తితో ఇప్పుడు చేపడుతున్న 'పేదరికంపై నా పోరాట యాత్ర' కార్యక్రమానికి కూడా పేద ప్రజల నుంచి మరింత మద్దతు లభించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# రాబరీ కేసును ఛేదించిన పోలీసులు

- నేరం జరిగిన 20 గంటల్లోనే ఇద్దరు నిందితుల అరెస్ట్

**జయభేరి, మేడిపల్లి :**



చెంగిచెర్ల ఆర్టీసీ కాలనీలో మహిళ మెడలోని బంగారు పుస్తెలతాడును లాక్కెళ్లిన చైన్ స్నాచింగ్ కేసును మేడిపల్లి పోలీసులు 20 గంటల్లోనే ఛేదించారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి మూడు తులాల బంగారు పుస్తెలతాడు, ద్విచక్ర వాహనం, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించనున్నారు. మేడిపల్లి ఏసీపీ మోహన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాజమండ్రికి చెందిన కంగాల వీవీఎస్‌వీ ప్రసాద్, తెలంగాణలోని వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన అజ్మీర వెంకటేష్ ఏడాది నుంచి స్నేహితులు. ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో బంగారు ఆభరణాలు ధరించిన మహిళలను లక్ష్యంగా చేసుకుని చైన్ స్నాచింగ్‌కు పాల్పడాలని పథకం వేశారు. ఇందులో భాగంగా ఓఎన్ఎన్ యాప్ ద్వారా ద్విచక్ర వాహనాన్ని బుక్ చేసుకుని ఉప్పల్‌లో తీసుకున్నారు. అనంతరం పోచారం, చెంగిచెర్ల పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ మహిళలను గమనించారు. సెప్టెంబర్ 2న రాత్రి 8.20 గంటలకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చెంగిచెర్ల ఆర్టీసీ కాలనీ వద్ద నడుచుకుంటూ వెళ్తున్న చల్ల భారతిని గుర్తించారు. అజ్మీర వెంకటేష్ ఆమె మెడలోని బంగారు పుస్తెలతాడును బలవంతంగా లాక్కున్నాడు. ద్విచక్ర వాహనంపై సిద్ధంగా ఉన్న ప్రసాద్ వద్దకు చేరుకుని, ఇద్దరూ అదే వాహనంపై చెంగిచెర్ల వైపు పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన మేడిపల్లి పోలీసులు సీసీ కెమెరాల దృశ్యాలతో పాటు సాంకేతిక ఆధారాలను విశ్లేషించి దర్యాప్తు చేపట్టారు. చోరీ జరిగిన 20 గంటల్లోనే నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారి వద్ద నుంచి చోరీ చేసిన మూడు తులాల బంగారు పుస్తెలతాడు, బైక్, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే నిందితులు చైన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు విచారణలో తేలిందని, నిందితులను కోర్టులో హాజరు పరిచి రిమాండ్ కి తరలించనున్నట్లు ఏసీపీ మోహన్‌కుమార్ తెలిపారు ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోందని, నిందితులపై గతంలో ఏమైనా కేసులు ఉన్నాయా? అనే కోణంలోనూ పరిశీలిస్తున్నట్లు చెప్పారు. కేసును చాకచక్యంగా 20 గంటల్లోనే ఛేదించిన మేడిపల్లి క్రైమ్ పోలీసులను ఏసీపీ మోహన్‌కుమార్ అభినందించారు. దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి పారితోషికం అందజేశారు.






## పీర్జాదిగూడలో 'వంటావార్పు'

- కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనా వైఫల్యాలను నిరసిస్తూ మాజీ మేయర్ జక్క వెంకటరెడ్డి 'వంటా-వార్పు' నిరసన కార్యక్రమం

**జయభేరి, మేడిపల్లి :**

ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో ప్రజలను ఆకట్టుకుని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. 1,000 రోజుల పాలనలో హామీల అమలును విస్మరించి ప్రజలను మోసం చేసిందని మాజీ మేయర్, బీఆర్ఎస్ నాయకుడు జక్క వెంకట్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. ఇచ్చిన హామీలపై ప్రజలకు సమాధానం చెప్పాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధిష్ఠానం పిలుపు మేరకు మల్కాజిగిరి నగరపాలక సంస్థ బోడుప్పల్ సర్కిల్ పరిధి పీర్జాదిగూడలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జక్క వెంకట్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వ 1,000 రోజుల పాలన వైఫల్యాలను నిరసిస్తూ వంటా-వార్పు, నిరసన కార్యక్రమాలు, సదస్సులు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జక్క వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు మహిళల ఓట్ల కోసం హామీల వర్షం కురిపించిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని ఒక్కొక్కటిగా పక్కన పెట్టిందని ఆరోపించారు. ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, కళ్యాణలక్ష్మిలో తులం బంగారం, దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్, మహిళలకు స్కూటీలు వంటి హామీలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. "ఓట్ల కోసం హామీలు.. అధికారంలోకి వచ్చాక మాట మార్చడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారింది. తెలంగాణ ప్రజలు ప్రతి హామీని గుర్తుపెట్టుకున్నారు. ప్రభుత్వ ప్రతి వైఫల్యాన్ని లెక్కపెడుతున్నారు. 1,000 రోజుల పాలనకు ప్రజలే తగిన సమాధానం చెబుతారు" అని జక్క వెంకట్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1,000 రోజుల పాలనలోని వైఫల్యాలను ప్రతి ఇంటికీ, ప్రతి వీధికీ తీసుకెళ్లి ప్రజలకు వివరిస్తామని, ప్రభుత్వంపై నిరసన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, లేతాకుల మాధవి రఘుపతి రెడ్డి, మధుసూదన్ రెడ్డి, కౌడే పోచయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నిర్మల, యూత్ అధ్యక్షుడు ప్రభు, సీనియర్ నాయకులు జావీద్ ఖాన్, ఆకుల మధుకర్, శ్యామల శ్రీనివాస్, యూబీఏ అధ్యక్షుడు ఆకుల సత్యనారాయణ, ఆంజనేయులు, బాలరాజు, కోనేటి వెంకట్, పింగళి జోగిరెడ్డి, యాసారం శ్రీనివాస్, మునికుంట్ల కిరణ్ గౌడ్, బుల్లెట్ శంకర్, జగన్ రెడ్డి,ప్రవీణ్ రెడ్డి, వీరమళ్ళ జగన్నాధం, శశిధర్ రెడ్డి, అశోక్, సతీష్, కిరణ్ నాయక్, పాశం నరేందర్ రెడ్డి, సోమేశ్, అక్షిత్, వెంకట్, నారాయణ రెడ్డి, అమర్ పటేల్, తిరుమలేష్, మధు,జమీర్, కిరణ్ గౌడ్, వారికల శ్రీనివాస్, చిరంజీవి, రమేష్, కైసర్, అనిల్, శ్రీనివాస్, సరస్వతి, కళ్యాణి, లావణ్య, రాజేశ్వరి, లక్ష్మి, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.






# బాలిక కిడ్నాప్ కేసులో కీలక పరిణామం

- హరియాణాలో నిందితుడి అరెస్ట్

**జయభేరి, గుంటూరు :**




గుంటూరు బాలిక కిడ్నాప్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న షేక్ జాన్‌సైదా అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు సమాచారం. హరియాణా రాష్ట్రంలోని కర్నాల్‌లోని ఓ హోటల్‌లో షేక్ జాన్‌సైదాను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. పదోతరగతి చదువుతున్న 15 ఏళ్ల బాలికను షేక్ జాన్‌సైదా తన మాయమాటలతో నమ్మించి తీసుకెళ్లినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాలిక తండ్రి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేయడం, ఈ పిటిషన్ విచారణ సందర్భంగా పోలీసుల వైఫల్యంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడం తెలిసిందే. దీంతో గుంటూరు బాలిక కిడ్నాప్ కేసు కోసం డీజీపీ హరీష్ గుప్తా ప్రత్యేక సిట్ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే హరియాణాలో షేక్ జాన్ సైదాను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

**అసలేం జరిగిందంటే.?**

గుంటూరులోని ఓ పాఠశాలలో ఓ 15 ఏళ్ల బాలిక పదో తరగతి చదువుతోంది. పర్చూరు చెందిన జాన్ సైదా అనే యువకుడు కొన్నాళ్ల క్రితం బాలికకు ఇన్‌స్టాలో పరిచయమయ్యాడు. ఆ బాలికను తన మాటలతో మభ్యపెట్టి, ఆకర్షించాడు. ఈ క్రమంలోనే జూన్ 9వ తేదీ ట్యూషన్ నుంచి ఇంటికి వచ్చిన బాలిక.. షాపు వద్దకు వెళ్తున్నానని అమ్మమ్మకు చెప్పి బయటకు వచ్చింది. ఈ సమయంలోనే ఇంటిలోని బంగారం, నగదు తన వెంట తీసుకెళ్లింది. అయితే షాపు వద్దకు వెళ్తున్నానని చెప్పిన బాలిక.. ఎంతకూ తిరిగి రాలేదు. దీంతో బాలిక తండ్రి కుమార్తె కోసం చుట్టుపక్కల గాలించారు. ఎక్కడా జాడ తెలియకపోవటంతో జూన్ 10న పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలిక తండ్రి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలోనే సీసీ పుటేజీ పరిశీలించగా.. జాన్ సైదా బాలికను బైక్‌పై తీసుకెళ్లినట్లు కనిపించింది. దీంతో బాలిక ఆచూకీని కనిపెట్టేందుకు ప్రత్యేక బృందాన్ని నియమించారు. ఈ ప్రత్యేక బృందం.. బాలిక తల్లిదండ్రులతో కలిసి మన రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటుగా కేరళ, కోయంబత్తూరు వంటి చోట్లా గాలించారు. అక్కడ సేకరించిన మాచారం ఆధారంగా సికింద్రాబాద్ వచ్చినట్లు గుర్తించారు. బేగంపేట రైల్వేస్టేషన్ నుంచి ఆటో ఎక్కి వెళ్లిపోయినట్లు పోలీసులు విచారణలో గుర్తించారు. ఆ తర్వాత బాలిక ఆచూకీ కనిపెట్టడం కష్టంగా మారింది. బాలిక ఇంటి నుంచి వెళ్లే సమయంలో భారీగా డబ్బు, నగలు తన వెంట తీసుకురావటంతో.. నిందితుడు సెల్ ఫోన్లు, నగరాలు, ప్రాంతాలు మారుస్తుండటతో ఆచూకీ కనిపెట్టడం క్లిష్టంగా మారింది.

**హైకోర్టు సీరియస్.. డీజీపీపై ఆగ్రహం..**

ఈ ఘటనపై బాలిక తండ్రి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేయగా.. విచారణ సందర్భంగా హైకోర్టు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. బాలికను తమ ముందు హాజరుపరచాలని ఆదేశిస్తే.. ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటారా అని ఏపీ డీజీపీని హైకోర్టు ప్రశ్నించింది. సిట్ ఏర్పాటు కంటితుడుపు చర్యేనన్న హైకోర్టు.. డీజీపీనే స్వయంగా రంగంలోకి దిగి బాలికను తమ ఎదుట హాజరుపరచాలంటూ ఆదేశించింది. ఈ క్రమంలోనే హరియాణాలోని కర్నాల్‌లో నిందితుడు షేక్ జాన సైదాను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి.



## ఈనెల 10న చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి

**జయభేరి, యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 04 :**

ఈనెల 10న తలపెట్టిన చలో హైదరాబాద్ కు ప్రభుత్వ ఉద్యోగులతో పాటు దేవాదాయశాఖ ఉద్యోగులు కూడా భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని టీజీఈజేఏసీ నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం యాదాద్రి కొండపైన శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయ ఉద్యోగులతో కలిసి చలో హైదరా బాద్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ దేవాదాయ శాఖ ఉద్యోగుల న్యాయమైన సమస్యలు, హక్కుల సాధనకు రాష్ట్ర టీజీఈజేఏసీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఆ సంఘం నేతలు పెండెం శ్రీనివాస్,గణగాని శశికాంత్ గౌడ్, పాశికంటి పవన్, గజవెల్లి రఘ,వెంకట ప్రసాద్,దోర్బాల భాస్కర్ శర్మ,సురేంద్ర చార్యులు, ఊడెపు రాజు,శ్రవణ్ కుమార్,రాజన్ బాబు, అశోక్,విజయ్,నరేష్,శ్రీధర్ శర్మ, శంకర్,నవీన్, సూర్యపెల్లి శివ,లక్ష్మీ నరసయ్య,వంశీకృష్ణ, స్వామి,నరేందర్,రాము, శివాజీ,హరిత,రత్నదీప, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో గల్లంతైన సత్తయ్య మృతదేహం లభ్యం

- ఫైర్ సిబ్బంది రిస్క్ మృతదేహం లభ్యం



**జయభేరి, యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 04 :**

యాదగిరిగుట్ట మున్సిపల్ పరిధిలోని గుండపల్లి నల్లచెరువులో గురువారం ఉదయం 11 గంటలకు చేపల పట్టేందుకు చెరువులోకి దిగిన ముక్కెర్ల సత్తయ్య (65) గల్లంతు కాగా,శుక్రవారం ఉదయం 9 గంటలకు దాదాపు 22 గంటల తర్వాత మృతదేహం లభ్యమైంది. ఫైర్ సిబ్బంది ప్రత్యేక బోటుతో రిస్క్ గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికి తీశారు. చెరువులో తీసిన కుంటలు చాలా లోతుగా ఉండడంతో గుంతకు ఒక ఒడ్డు నుంచి మరో ఒడ్డుకు చేపల వల కట్టేందుకు వెళ్లి ప్రమాదవ శాత్తు చెరువులో మునిగినట్టు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు రాత్రి 8 గంటల వరకు ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ మృతదేహం లభ్యం కాలేదు. శుక్రవారం ఉదయం మళ్లీ గాలింపు చర్యలు మొదలు పెట్టి మృతదేహాన్ని బయటకు తీశారు. ప్రమాదానికి గురైన సత్తయ్య కుటుంబ సభ్యులు,గ్రామస్తులు మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహానికి సంఘటనా స్థలంలో యాదగిరిగుట్ట తహశీల్దార్ గణేష్‌నాయక్, సీఐ బొడ్డుపల్లి భాస్కర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ యాదవ్, మున్సిపల్ కౌన్సిలర్ సత్యనారాయణ, ఆర్ఐ,పోలీసులు పరిశీలించారు. పంచనామా నిర్వహించిన అనంతరం పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు సీఐ భాస్కర్ తెలిపారు. చెరువులు,కుంటల్లో చేపల వేటకు వెళ్లే సమయంలో ప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



## ఉచిత కంటి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ ఉచిత కంటి శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ కోరారు.శుక్రవారం దేవరకొండ పడమటిపల్లిలో పల్లా నర్సిరెడ్డి మెమోరియల్ సొసైటీ మరియు శంకర నేత్రాలయం, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత కంటిపొర శిబిరంకు సంబంధించిన వాల్ పోస్టర్లను రమావత్ రవీంద్ర కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....కంటి సమస్యలతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు ఇలాంటి శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కంటి చూపు సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ ఉచిత కంటి శిబిరానికి హాజరై వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అవసరమైన వారికి వైద్యుల సూచనల మేరకు కంటిపొర శస్త్రచికిత్సలు కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఉపయోగపడే ఇటువంటి సేవా కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ బీల్యా నాయక్, PACS చైర్మన్ పల్లా ప్రవీణ్ రెడ్డి, స్థానిక సర్పంచ్ పల్లా శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అమరా ప్రసాద్ దిష్టిబొమ్మ దగ్ధం

**జయభేరి, జయభేరి, కూకట్ పల్లి :**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్పై అమర్ ప్రసాద్ కల్పిత నాయకుడు అనే పేరుతో పుస్తకం రచించి, ఈ నెల 18న విడుదల చేయనున్నట్లు సోషల్ మీడియాలో ప్రకటించారు. దీనిని నిరసిస్తూ కూకట్పల్లి వై జంక్షన్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత, బహుజన నాయకుల ఆధ్వర్యంలో అమర్ ప్రసాద్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ను అవమానించేలా పుస్తకం రాసి విడుదల చేయడం సరికాదన్నారు. ఈ పుస్తకం వెనుక కొంతమంది శక్తులు ఉన్నాయనే అనుమానం తమకు ఉందని పేర్కొన్నారు.

## బస్సు బోల్తా.. డ్రైవర్ మృతి

**జయభేరి, కామారెడ్డి :**

కామారెడ్డి జిల్లా జుక్కల్ చౌరస్తా సమీపంలో ఆర్టీసీ బస్సుకు ప్రమాదం జరిగింది. అతివేగంతో రక్షణ గోడను ఢీకొట్టి బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందాడు. పలువురికి గాయాలు అయ్యాయి. ప్రమాద సమయంలో బస్సులో 13 మంది ప్రయాణికులు వున్నారు. క్షతగాత్రులను బిచ్కుంద ఆసుపత్రికి తరలించారు. బస్సు హైదరాబాద్ నుంచి బిచ్కుందకు వెళ్తుండగా ప్రమాదం జరిగింది.

## పెదకాకానిలో ఉద్రిక్తత

**జయభేరి, గుంటూరు :**

పెదకాకాని లో శుక్రవారం ఉద్రికత్త నెలకొంది. మాల్లాది విష్ణు కారుపై దాడికి టీడీపీ కార్యకర్తలు ప్రయత్నించడం కలకలం రేపింది. అమ్మవారి మంగళసూత్రం మాయం కావడంపై ఆందోళన మొదలయింది. నాంతాడు కానుకగా అంబటి మురళీ కృష్ణ సమర్పించడానికి ముందుకు వచ్చారు. అంబటి మురళీ కృష్ణను అడ్డుకోవాలని టీడీపీ నాయకుల ప్లాన్ వేసారు. ఈ నేపథ్యంలో పెదకాకాని ఆలయానికి టీడీపీ నాయకులు భారీగా చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యే మాల్లాది విష్ణును అడ్డుకొని.. దాడికి యత్నం చేసారు.

# మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆడియో సీడీ ఆవిష్కరణ

**జయభేరి, మేడ్చల్ :**




ప్రజా సేవలో ఎల్లప్పుడూ ముందుండే ప్రజా నాయకుడు, మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి నిండు నూరేళ్లు భగవంతుని ఆశీస్సులతో ఆయురారోగ్యాలతో జీవించాలని బీఆర్ఎస్ నాయకుడు, ఎక్స్పర్ట్ సెక్యూరిటీ డైరెక్టర్ ప్రదీప్ సింగ్ ఆకాంక్షించారు. మల్లారెడ్డి పుట్టినరోజు సందర్భంగా రూపొందించిన ప్రత్యేక ఆడియో సీడీని మల్లారెడ్డి హెల్త్ సిటీ డైరెక్టర్ సీహెచ్ భద్రారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రదీప్ సింగ్ మాట్లాడుతూ మల్లారెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం మల్లారెడ్డి చేసిన కృషి అభినందనీయమన్నారు.

రాజకీయాల్లో ఉన్నత పదవులు చేపట్టినప్పటికీ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేసిన నాయకుడిగా మల్లారెడ్డికి ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో విద్య, వైద్యం, మౌలిక వసతులు, రహదారులు, తాగునీరు తదితర రంగాల అభివృద్ధికి మల్లారెడ్డి విశేషంగా కృషి చేశారని ప్రదీప్ సింగ్ పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు అండగా నిలుస్తూ అనేక సేవా కార్యక్రమాలు చేపట్టిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి వారికి అండగా నిలిచే నాయకత్వం మల్లారెడ్డిదని కొనియాడారు. మల్లారెడ్డి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. భగవంతుడు ఆయనకు సంపూర్ణ ఆరోగ్యం, సుఖసంతోషాలు, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. మల్లారెడ్డి నాయకత్వంలో మేడ్చల్ నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధించాలని, ప్రజల ఆశీస్సులు ఆయనకు ఎల్లప్పుడూ ఉండాలని ప్రదీప్ సింగ్ ఆకాంక్షించారు.

# యువత హక్కుల కోసం ప్రతి ఒక్కరూ పోరాడాలి

**జయభేరి, యాదగిరిగుట్ట :**




భారత దేశంలో రోజురోజుకు నిరుద్యోగం పెరిగిపోతోందని,యువత హక్కుల కోసం పోరాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 8,9,10 తేదీల్లో యాదగిరిగుట్టలో జరిగే ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం యాదగిరిగుట్టలో సీపీఐ జిల్లా అధ్యక్షుడు యానాల దామోదర్ రెడ్డి అధ్యక్షతన మహాసభల ఆహ్వాన సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 8న మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్న భారీ యువజన ప్రదర్శన, అనంతరం జరిగే బహిరంగ సభను జయప్రదం చేసేందుకు యువత, విద్యార్థులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. భారత దేశంలో నిరుద్యోగం, పేపర్ లీకులు,విద్యా,వైద్య రంగాల ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ,ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యం, యువతపై పెరుగుతున్న ఆర్థిక,సామాజిక భారాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నా యని అన్నారు. యువత సంఘటితమైతే సమాజం మారుతుందనే స్ఫూర్తితో ఈనెల 8న జరిగే భారీ యువజన ప్రదర్శన, బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర,ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ తీర్పారీ వెంకటేశ్వర్లు, చేపూరి కొండల్,ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కురుమీద్ది శ్రీనివాస్,సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, చెడే చంద్రయ్య,సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లెం కృష్ణ, బండి జంగమ్మ,కొల్లూరి రాజయ్య, ఉప్పల ముత్యాలు, ఎండీ.ఇమ్రాన్, పల్లె శేఖర్ రెడ్డి, ఏషాల అశోక్, చిగుర్ల లింగం, కూసుమని హరీష చంద్ర, సీపీఐ యాదగిరిగుట్ట మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, మున్సిపల్ కౌన్సిలర్ బబ్బురి శ్రీధర్, సిపిఐ నేతలు పేరబోయిన పెంటయ్య, బంగారుతో పాటు యువజన,పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బొడ్రాయి బజార్ లో కన్నుల పండుగగా బోనాల పండుగ

- ఆనందోత్సవాల మధ్య బొడ్రాయి వద్ద బోనం సమర్పించిన మహిళలు
- అంగరంగ వైభవంగా బోనాల పండుగను ఘనంగా చేపట్టిన బొడ్రాయి బజార్ వాసులు


**జయభేరి, దేవరకొండ :**



దేవరకొండ పట్టణంలోని బొడ్రాయి బజారులో బోనాల పండుగను కన్నుల పండుగగా నిర్వహించారు. పట్టణంలోని బొడ్రాయి బజార్ వాసులు హిందూ సాంప్రదాయం ఉట్టిపడేలా బోనాల వేడుకను అంగరంగ వైభవంగా చేపట్టారు. మహిళలు యువతులు పట్టు వస్త్రాలతో సంప్రదాయబద్ధంగా అలంకరించుకొని మట్టి కుండ కు పసుపు బొట్టు పెట్టి పరమాన్నంతో బోనం తయారుచేసి మట్టి ప్రమిదలో దీపాన్ని వెలిగించి వేపాకులు పూలతో ఆకట్టుకునేలా అలంకరించిన బోనంను మహిళలు నెత్తిన పెట్టుకొని ఊరేగింపుగా బయలుదేరి బొడ్రాయి వద్దకు చేరుకున్నారు.

యువకులు, కాలనీ పెద్దలు డీజే సౌండ్, బ్యాండు వాయిద్యాల మధ్య నృత్యాలు చేయగా, పోతురాజులు వేసిన విచిత్ర విన్యాసాల మధ్య, మహిళలు యువతులు కోలాటాలు వేసి ఒక ఆహ్లాద భరితమైన వాతావరణంలో బొడ్రాయి బజార్ వాసులంతా ఆనందోత్సవాల మధ్య బోనాల పండుగను ఘనంగా కన్నుల పండుగగా నిర్వహించారు. బోనం ను బొడ్రాయి వద్ద అప్పచెప్పి పోతురాజుల వద్ద మేకలను, కోళ్లను, మేకపోతులను బలి ఇచ్చి మహా నైవేద్యంగా సమర్పించారు. తరతరాలుగా సాంప్రదాయ బద్ధంగా వస్తున్న బోనాల పండుగ ద్వారా ఆహ్లాదకరమైన ఆరోగ్యకరమైన వాతావరణం సృష్టింపబడుతుందని, రాత్రివేళ దీపాలు వెలిగించిన బోనం తో ముస్తాబైన మహిళలు ర్యాలీగా బోనాలు సమర్పించే తీరును చూడడానికి రెండు కళ్ళు సరిపోవు అనే అంత ఆనందం వేస్తుందని బొడ్రాయి బజార్ వాసులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బొడ్రాయి బజారుకు చెందిన పెద్దలు యువతి యువకులు మహిళలు చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సేవ గురుతరమైనది కొలువ లేనిది



- సామాజికవేత్త సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రైవేట్ టీచర్స్ ఫోరం లోని ఉపాధ్యాయులను జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఒకరోజు ముందుగా ప్రైవేట్ టీచర్లను ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా సామాజికవేత్త, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ప్రపంచంలో కొలువ లేనిదని వారి సేవలు ఎనలేని ప్రపంచానికి మేధావులను తయారు చేసే యంత్రాలు గురువులే అని కొనియాడారు. ఉపాధ్యాయులు అంధకారంలో ఉన్నటువంటి మనుషుల యొక్క జ్ఞానాన్ని వెలుగుమయం చేసేటటువంటి వృత్తి, విద్యార్థి యొక్క జీవితాలకు నైపుణ్యత, పరిజ్ఞానాన్ని, జీవిత లక్ష్యాలను సంస్కారాన్ని నేర్పించేటటువంటి బాధ్యత గురువులకే ఉంది. ఈ కార్యక్రమంలో ఆర్ కోటేశ్వరరావు, డి రుణాదేవి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, ముడి అంజయ్య, ముడి రాజశ్రీ, ఎండి రంజాన్ బేగ్, ఆడారపు గణేష్, ఉడుత సలేశ్వర్ యాదవ్, బొడ్డు వెంకటరమణ, గడ్డం బిక్షమయ్య, అప్పం వీరయ్య, పున్న బిక్షమయ్య, డాక్టర్ భాషా చౌహన్, ఆర్ జ్యోతి, ఎం సుజాత, కనీష్, లావణ్య, పర్వీన్, కే సంజీవ్, టి రవికుమార్, లచ్చిరాం నాయక్, ప్రైవేటు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ లో మరో ట్రావెల్ బస్సు దగ్ధం...

- డ్రైవర్ అప్రమత్తతో ప్రయాణిస్తున్న ప్రయాణికులు సేఫ్

**జయభేరి, సికింద్రాబాద్ :**

సికింద్రాబాద్లోని ఇస్కాన్ టెంపుల్లో కృష్ణాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉదయం నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని శ్రీకృష్ణుడిని దర్శించుకుంటున్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహిస్తున్నారు. ఆలయాన్ని పూలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. ఆధ్యాత్మిక శోభతో పరిఢవిల్లుతున్నాయి.



# సరికొత్త కాన్సెప్ట్‌తో లీసా..:

అనన్య నాగళ్ల ప్రధాన పాత్ర పోషిస్తున్న చిత్రం 'లీసా'. జవహర్ పవార్ దర్శకుడు. వెంకట్ దుగ్గిరెడ్డి, ఐల రామకృష్ణ నిర్మాతలు. ఈ సినిమా షూటింగ్ విజయవంతంగా పూర్తయింది. నిర్మాణానంతర కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేసి నవంబర్‌లో సినిమాను విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా దర్శక,నిర్మాతలు మాట్లాడుతూ 'సినిమా చాలా బాగా వచ్చింది. భారతీయ తెరపై ఇప్పటివరకూ రాని కొత్త కాన్సెప్ట్‌తో 'లీసా' తెరకెక్కుతున్నది. రెండు భిన్నమైన జోనర్లను మేళవించి, సరికొత్త పద్ధతిలో ఈ సినిమా రూపొందించాం. ఈ కథ నచ్చి అగ్ర సంగీత దర్శకుడు మణిశర్మ సంగీతం అందించేందుకు సిద్ధమయ్యారు. సినిమా మేకింగ్, అనన్య నాగళ్ల నటన ఈ సినిమా ప్రధాన బలాలు' అని తెలిపారు. అల్లాల రవిరెడ్డి, సుమన్, ముసా అలీ ఖాన్, రత్నాకర్‌రెడ్డి, జబర్దస్త్ సత్యశ్రీ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సహ నిర్మాత, కథనం, ఛాయాగ్రహణం: సతీష్‌రెడ్డి మాసం, సమర్పణ: అయాన్ష్‌రెడ్డి మాసం, నిర్మాణం: ఓంసాయిరామ్ ఆర్ట్స్, ఐరాస్ ఎంటర్‌టైన్మెంట్స్.



# ఎపిక్ పెద్ద విజయం సాధించాలి

'ట్రైలర్ చాలా బావుంది. నాకు కెడ్రామాలంటే ఇష్టం. ట్రైలర్ చూస్తుంటే కెడ్రామా వైబ్‌లో ఉంది. సినిమా కూడా అలాగే ఉంటుందని అనుకుంటున్నా. ఈ సినిమా పెద్ద సక్సెస్ సాధించి ఆనంద్‌కి గొప్ప పేరు తీసుకురావాలి. వైష్ణవి అద్భుతంగా చేసిందని అంతా అంటున్నారు. ఆదిత్యహాసన్ చూడ్డానికి ఇన్నోసెంట్‌గా ఉన్నాడు. ట్రైలర్ చూస్తుంటే నెక్ట్స్ లెవల్. సినిమా ఇంతకు మించి ఉంటుందని ఆశిస్తున్నా. సెప్టెంబర్ 11న సినిమా రిలీజ్. 10న ప్రీమియర్స్ ఉంటాయి. తప్పకుండా చూడండి' అని అగ్ర కథానాయిక రష్మిక మందన్నా అన్నారు. ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటించిన యువతరం ప్రేమకథ 'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్'. ఆదిత్యహాసన్ దర్శకుడు.సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 11న విడుదల కానున్నది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో రష్మిక మాట్లాడారు. ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ 'విజయ్ లాంటి అన్నయ్య, రష్మిక లాంటి వదిన దొరకడం నాఅదృష్టం. ఇక 'ఎపిక్' విషయానికొస్తే.. ఈ సినిమా చూస్తే మన జీవితాల్లో ఎపిక్ మూమెంట్స్ గుర్తొస్తాయి. ఇది నిజంగా ప్రత్యేకమైన సినిమా. దర్శకుడు ఆదిత్య హాసన్ లోతుగా అధ్యయనం చేసి ఈ సినిమా చేశారు. వైష్ణవి కళ్లతోనే అద్భుతమైన భావాలు పలికించింది. ఇది వెరీ ఎమోషనల్ ఫిల్మ్. కచ్చితంగా మిమ్మల్ని సర్‌ప్రైజ్ చేస్తుంది' అని నమ్మకంగా చెప్పారు. ఇంకా కథానాయిక వైష్ణవి చైతన్య, చిత్ర దర్శకుడు ఆదిత్య హాసన్, మ్యూజిక్ డైరెక్టర్ హేషమ్ అబ్దుల్ వహాబ్, నటుడు శివాజీ కూడా మాట్లాడారు. అతిథులుగా విచ్చేసిన దర్శకులు శివ నిర్వాణ, శైలేష్ కొలను, వినోద్ అనంతోజు, కల్యాణ్ శంకర్, సాయిమార్తాండ్ చిత్ర బృందానికి శుభాకాంక్షలు అందించారు.

# డ్రాగన్ డేట్ మారదు



'డ్రాగన్' షూటింగ్‌లో ఎన్టీఆర్ భుజానికి గాయమైన విషయం తెలిసిందే. ఆగస్ట్‌లో ఆయనకు సర్జరీ కూడా జరిగింది. ప్రస్తుతం తారక్ రెస్ట్ మోడ్‌లో ఉన్నారు. దాంతో 'డ్రాగన్' సినిమా అనుకున్న డేట్‌కి విడుదల కావడం కష్టమే అంటూ సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఈ సినిమాను వచ్చే ఏడాది జూన్ 11న విడుదల చేయనున్నట్టు ఇప్పటికే నిర్మాతలు ప్రకటించారు. ఈ నేపథ్యంలో వస్తున్న విమర్శలపై నిర్మాతల్లో ఒకరైకొత్త సినిమాలు చూడండి 'డ్రాగన్'ని అనుకున్న డేట్‌లోనే కచ్చితంగా విడుదల చేస్తామని, మరో రెండు వారాల్లో షూటింగ్ మొదలవుతుందని, ఫిబ్రవరి కల్లా షూటింగ్ మొత్తం పూర్తిచేస్తామని రవిశంకర్ తెలిపారు. ఇందులో ఎన్టీఆర్ 'లూగర్' అనే ఉద్వేగపూరితమైన పాత్రలో కనిపించనున్నారు. ప్రశాంత్ నీల్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ఈచిత్రంలో రుక్మిణీ వసంత్, అనిల్‌కపూర్, బిజు మీనన్ ముఖ్య పాత్రలు పోషిస్తున్న విషయం తెలిసిందే.

# ఘనంగా "డెలులు" చిత్ర టీజర్ లాంచ్




క్రియేటివ్ లాంచ్ పాడ్ బ్యానర్ పై ప్రీతం కస్తూరి దర్శకత్వంలో సంకీర్త్ కొండ నిర్మాతగా ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం డెలులు. విజయ రాజ్ కుమార్, వేణి రావు, సాయి ప్రసన్న, అఖిల్ జాక్సన్, శ్రీరామ మండవ కీలక పాత్రలు పోషించారు. రేష్మిత్ ఎస్ కౌశిక రచించిన ఈ కథకు విజయ రాజ్ కుమార్ డైలాగులు అందించగా జై రాజ్ నాయుడు సినిమాటోగ్రఫీ చేశారు. ఆది చేబ్రోలు సంగీతాన్ని అందించిన ఈ చిత్రానికి హరికృష్ణ కూరపాటి ఎడిటర్ గా పనిచేశారు. నేటి జెన్ జి యువతకు దగ్గరగా ఉండే ఈ సినిమా జెన్ జి భాషలోనే డెలులు అని ఉపయోగించే ఒక పదంతో జెన్ జి ప్రేక్షకులను టార్గెట్ గా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్ర టీజర్ విడుదల కావడం జరిగింది. నటుడు అఖిల్ జాక్సన్ మాట్లాడుతూ... "మొదటిసారి ఇలా స్టేజ్ పై మాట్లాడుతున్నాను. నేను ఈ స్థాయిలో ఉన్నాను అంటే దానికి కారణం మా అమ్మ. నాకు అవకాశం ఇచ్చిన సినీ బృందానికి థాంక్స్. సినిమా చాలా బావుండబోతుంది. ఇక్కడికి వచ్చిన వారికి అందరికీ థాంక్స్" అన్నారు. హీరోయిన్స్ వేణి రావు, సాయి ప్రసన్న మాట్లాడుతూ... "ఈ కార్యక్రమానికి వచ్చి మాకు సపోర్ట్ చేసిన అందరికీ థాంక్స్. సినిమా కోసం చాలా కష్టపడ్డారు. మాకు అవకాశం అందించిన దర్శకనిర్మాతలకు థాంక్స్. సినిమా చాలా బావుంటుంది. అందరూ మమ్మల్ని ఆదరించవలసిందిగా కోరుకుంటున్నాము" అన్నారు.

చిత్ర దర్శకుడు ప్రీతం మాట్లాడుతూ... "ఈ కార్యక్రమానికి హాజరైన మీడియా మిత్రులకు, ముఖ్య అతిథులకు ధన్యవాదాలు. సినిమా అనేది ఒక్కరి కృషితో సాధ్యం కాదు, మొత్తం టీమ్ సమష్టి కృషి వల్లే సినిమా పూర్తవుతుంది. ప్రొడక్షన్ కంట్రోలర్ చందు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రిత్విక్, డైరెక్షన్ టీమ్ క్రాంతి, నారాయణ, డీవోపీ జయరాజ్, మ్యూజిక్ డైరెక్టర్ ఆది చేబ్రోలు, ఎడిటర్ హరికృష్ణలకు ప్రత్యేక కృతజ్ఞతలు. సినిమాలో సంగీతం, డైలాగ్స్ ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయి, టీజర్‌లో విన్న మ్యూజిక్ కంటే సినిమాలో మరింత అద్భుతమైన సంగీతం ఉంటుంది. విజయ్ రాజ్‌కుమార్ రాసిన కథ ఆధారంగా విజన్‌తో డైలాగ్స్‌ను రూపొందించడం జరిగింది. హీరోయిన్లు ప్రసన్న, వేణి, మదర్ రోల్ చేసిన రమ, బాలనటిగా నటించిన అనికకు కూడా ధన్యవాదాలు. ఈ సినిమాతో డెబ్యూ డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నాను, నా పై నమ్మకం ఉంచి అవకాశం ఇచ్చిన నిర్మాత సంకీర్తి గారికి, హీరో విజయ్ రాజ్‌కుమార్ గారికి జీవితాంతం కృతజ్ఞుడిగా ఉంటాను" అన్నారు. నటుడు విజయ్ రాజ్ కుమార్ మాట్లాడుతూ... "ఈ కార్యక్రమానికి వచ్చిన మీడియా మిత్రులందరికీ ధన్యవాదాలు. డెలులు సినిమా వెనుక సంకీర్త్ కొండ కీలక పాత్ర పోషించారు. నేను కేవలం 10 నిమిషాల ఫోన్ కాల్‌లో కథ చెప్పగానే సంకీర్త్ సినిమా నిర్మించడానికి ముందుకొచ్చారు. టీజర్‌లో కూడా 'బిలీవ్డ్ బై సంకీర్త్ కొండ' అని ప్రత్యేకంగా పేర్కొన్నాము. ఇప్పటివరకు ఎవరూ సాహసించని కథను 'డెలులు' ద్వారా చెప్పబోతున్నాము, ప్రేక్షకులు సినిమాలో కొత్త అనుభూతిని పొందుతారు. సినిమాను భారీగా ప్రమోట్ చేయాలనే ఉద్దేశంతో టైటిల్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ముందుగానే నాలుగైదు కార్యక్రమాలు నిర్వహించాము.

సినిమా డబ్ కట్ చూసిన తర్వాత నిర్మాత మార్కెటింగ్ బడ్జెట్‌ను పెంచి, సినిమాను మరింత గ్రాండ్‌గా ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నారు.

డీవోపీ జైరాజ్ నాయుడు, మ్యూజిక్ డైరెక్టర్ ఆది, ఎడిటర్ హరికృష్ణ, హీరోయిన్ శ్రీదేవి, హీరోయిన్లు, నటుడు అఖిల్ తదితరులు కృషి చేశారు. ముఖ్యంగా ఎడిటర్ హరికృష్ణ టీజర్‌ను అద్భుతంగా కట్ చేశారు. డెబ్యూ డైరెక్టర్ ప్రీతమ్ చాలా బాగా సినిమాను తెరకెక్కించారు, తన మొదటి సినిమాతోనే మంచి ప్రతిభ చూపించారు. నటుడు అభినయ్‌కు సినిమాలో మంచి పాత్ర ఉంటుంది. సినిమాలో పనిచేసిన వారంతా కొత్తవాళ్లే. ఈవెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన పీఆర్ఓ మధు, అజయ్, స్టార్ సర్కిల్ టీమ్‌కు ధన్యవాదాలు. రైటర్ రేష్మిత్ కలిసి కథను వేగంగా పూర్తి చేయడంలో ఎంతో సహకరించారు. నా తొలి సినిమా సమయంలో మెగా స్టార్ చిరంజీవి తనను అభినందిస్తూ మెసేజ్ పంపడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. ఒకసారి చిరంజీవి పెట్టిన వాట్సాప్ స్టేటస్ చూసి, "చిరంజీవి నన్ను హీరోగా నమ్ముతున్నప్పుడు నేను కూడా నన్ను నమ్మాలి" అని భావించాను. ఆ ఆలోచనతోనే మళ్లీ కొత్తగా ప్రారంభించాను, ఇప్పుడు 'డెలులు' ప్రేక్షకుల ముందుకు వస్తుంది. చిరంజీవి వాట్సాప్ స్టేటస్ నా జీవితాన్ని మార్చేసింది" అంటూ ముగించారు.



# చెప్పుకోండి చూద్దాం.!

సీనియర్ హీరోయిన్ రాశి ఇప్పుడు సెకండ్ ఇన్నింగ్స్ మొదలు పెట్టి సినిమాలు, సీరియల్స్ లో నటిస్తూ ఆకట్టుకుంటున్నారు. అప్పట్లో రాశికి కుర్రాళ్లలో విపరీతమైన క్రేజ్ ఉండేది. ఇక రాశి అమ్మ, అక్క, వదిన పాత్రలు చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఇండస్ట్రీలో మరో రాశి కూడా దూసుకుపోతుంది. ఆమె రాశి ఖన్నా.. ఈ కుర్ర హీరోయిన్ ఇప్పటికే స్టార్ హీరోల సినిమాల్లో నటించి మెప్పించింది. అలాగే కెరీర్ లో మంచి హిట్స్ కూడా అందుకుంది ఈ చిన్నది. ముందుగా ఈ చిన్నది బాలీవుడ్ లో సినిమాలు చేసింది. ఆతర్వాత ఊహలు గుసగుసలాడే సినిమాతో టాలీవుడ్ కు పరిచయం అయ్యింది ఈ వయ్యారి భామ. మొదటి సినిమా మంచి విజయాన్ని అందుకుంది. అలాగే అందం, నటన పరంగాను రాశీ ఖన్నాకు మంచి మార్కులు పడ్డాయి. ఇక రాశీ ఖన్నా తెలుగులో వరుసగా సినిమాలు చేసింది. యంగ్ హీరోలకు జోడీగా నటిస్తూ దూసుకుపోయింది ఈ అమ్మడు. అలాగే తమిళ్ లోనూ ఛాన్స్ లు అందుకుంది. తెలుగులో స్టార్ హీరో ఎన్టీఆర్ నటించిన జై లవ కుశ సినిమాలోనూ నటించింది. కానీ ఈ అమ్మడు అంతగా అవకాశాలు రావడం లేదు. ఇటీవలే ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ప్రస్తుతం ఈ చిన్నది సినిమాల స్పీడ్ తగ్గించింది. కాగా సీనియర్ రాశి, యంగ్ హీరోయిన్ రాశి ఈ ఇద్దరితో కలిసి నటించిన హీరో ఎవరో తెలుసా.? ఆ హీరో మరెవరో కాదు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్. అవును ఈ ఇద్దరు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తో కలిసి నటించారు. సీనియర్ హీరోయిన్ రాశి పవన్ కళ్యణ్ కలిసి గోకులం లో సీత సినిమాలో నటించారు. ఆతర్వాత పవన్ కళ్యాణ్ రాశి ఖన్నా కలిసి ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో నటించారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com**, **www.jayabheridaily.com**